ఆదివారం

ప్రజాశక్తి

ఫిబ్రవరి 15, 2004

లేపాక్షి నంది

కాల్ సెంటర్స్......

హ్యాపీ బర్త్‌డే

(15-2-2004 నుండి 21-2-2004వరకు)

గీతాంజలి
5సం॥, 15.2.1999
లీలావతి-గిరిబాబు
అనకాపల్లి-విశాఖపట్నం

అన్విత
1సం॥, 16.2.2003
స్వర్ణలత-వీరప్రతాప్‌రెడ్డి
పీలేరు-చిత్తూరు

శ్రీదేవి
2సం॥, 16.2.2002
కృష్ణవేణి-త్రినాథ్
అరసవిల్లి-శ్రీకాకుళం

యోగితారెడ్డి
3సం॥, 17.2.2001
విజయ-నాగిరెడ్డి
కృష్ణలంక-విజయవాడ

పి. ప్రవల్లిక
6సం॥, 18.2.1998
ప్రమీల-సుందరరావు
బలిజేపల్లి-గుంటూరు

ఎన్.వేదమాలిక
6సం॥, 17.2.1998
లక్ష్మి-మధు
హైదరాబాదు

కరణ్
3సం॥, 18.2.2001
పద్మ-వెంకటేష్
జియాగూడ-హైదరాబాద్

రాములు
1సం॥, 18.2.2003
పద్మ-వెంకటేష్
జియాగూడ-హైదరాబాద్

పూజామధురి
1సం॥, 20.2.2003
సుజాత-ప్రభాకర్
రోచపాలేం

అక్షితభట్
4సం॥, ఫిబ్రవరి-2000
వీణ-రాఘవేంద్ర
భ్రమరాంబికానగర్-మెదక్

మమ్మి
1సం॥, ఫిబ్రవరి-2003
అనసూయ-మల్లేష్‌యాదవ్
శంషాబాద్-రంగారెడ్డి

వై. మేఘన
లత-శ్రీనివాస్
వట్టింల-కరీంనగర్

చాయంది
రాధ-చిట్టిబాబు
నందిమంగళం-చిత్తూరు

పి.ఎస్.ఎ. నాయుడు
7సం॥, ఫిబ్రవరి-1997
లీలావతి-శ్రీనివాసరావు
అనకాపల్లి-విశాఖ

వి. మౌనిక
7సం॥, ఫిబ్రవరి-1997
వాణిశ్రీ-శ్రీనివాసరావు
గజపతినగరం-విజయనగరం

నిఖిల్-అఖిల్
ఉమ-జోగారావు
కోటబొమ్మాళి-శ్రీకాకుళం

అంజిని
శ్రీదేవి-శ్రీనివాసరావు
గజపతినగరం-విజయనగరం

ప్రసన్న
విజయలక్ష్మి-బాస్కర్
పర్తీపూర్-మ॥నగర్



లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

జ్యోతిబసు జీవితం యువతకు ఆదర్శం కావాలి

అలుపెరగని పోరాట స్ఫూర్తి పాలనాదక్షుడు జ్యోతిబసు కవర్ స్టోరీ చాలా బాగుంది. నేటి యువతరం జ్యోతిబసు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవలసి ఉంది. రాజకీయ వాదులంటే అవకాశవాదులుగా ముద్ర వున్న నేటి సమాజంలో ప్రజానాయకుడిగా, కమ్యూనిస్టు యోధుడిగా తన ప్రతిభా పాటవాలను కమ్యూనిస్టు పార్టీ కోసం వెచ్చించిన జ్యోతిబసు కృషి ఎనలేనిది. అంత ఎత్తుకు ఎదిగినా ఆయన క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు కార్యకర్తగా, నిగర్విగా ఉండటం హర్షించదగిన విషయం.

వయస్సు తొంభై ఏళ్ళు నిండినా ఉదయం ఏడుగంటలకే నిద్రలేచింది మొదలు రాత్రి పదిగంటల దాకా రాజకీయంగా బిజీగా ఉండటం ఆయన గొప్పతనం. ఆయన జీవితమంతా పోరాటాల మయం. కమ్యూనిస్టు పార్టీకి చెందిన నేతగా ఐదుసార్లు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై సాధించిన అపూర్వ ప్రపంచ రికార్డు ఆయన స్వంతం.

బెంగాల్ రాష్ట్రంలో కమ్యూనిజానికి బలమైన పునాదులు ఏర్పరచి వామపక్ష సంఘటన ప్రభుత్వస్థాపనకు ఆయన చేసిన కృషి మరువరానిది. రాష్ట్రాభివృద్ధికి జ్యోతిబసు పాలన బంగారు బాటలు పరిచింది. కుంభకోణాలతో





అవినీతి కార్యకలాపాలతో దేశం దద్దరిల్లిపోతుంటే వీటికి అతీతంగా బెంగాల్ రాష్ట్రం ప్రశాంతం, అభివృద్ధి దిశగా పయనించడం లెఫ్ట్‌ఫ్రంట్ నిష్పక్షపాలనా రీతికి అద్దం పడుతుంది.

ఏదిఏమైనా ఇటువంటి నిస్వార్థ నాయకుడు భరతమాత ముద్దుబిడ్డ కావడం మనందరికీ గర్వకారణం.

– కృష్ణాంజనేయులు, పిడుగురాళ్ళ, గుంటూరు జిల్లా.

– షేక్ గౌస్‌పీర్ వలి, షేక్ ఖాజావలి, షేక్ నాసర్ వలి, షేక్ కరిముల్లా, షేక్, గఫార్, షేక్ అమీర్‌భాష, షేక్ బాబు, షేక్ సైదా, షేక్ వలీసాహెబ్, షేక్ రఫీ, యర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా.

– మంకుశ్రీను, కొప్పర్రు, ప.గోదావరి.

– కామిడి సతీష్ రెడ్డి, జడలపేట, వరంగల్ జిల్లా.

– బట్టా రామకృష్ణ, సౌత్‌మోపూరు గ్రామం, నెల్లూరు జిల్లా.

అసాధారణం

ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన 'వినిపించని విజేత' కదిలించింది. పుట్టుచెవిటి అయిన రంజనిని ఉత్తమ క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన ఆమె తండ్రి అభినందనీయుడు. వ్యక్తి విజయానికి అంగవైకల్యం అడ్డురాదని నిరూపించిన ఆ తండ్రీ కూతుళ్ళు ఒక ఆదర్శాన్ని సమాజానికి అందించారు. బాడ్మింటన్‌లో రాణించిన ఆమెకు భారత ప్రభుత్వం అర్జున్ అవార్డు ప్రకటించడం అసాధారణమైన విషయం.

– షేక్ ఆలీవలి, మొగల్తూరు, ప.గో.జిల్లా.

థాంక్స్

ఫిబ్రవరి 1 ఆదివారం అనుబంధం లోని బాలనేస్తాలు సూపర్‌గా వుంది. ఇదేమి చిత్రంలో ఆసక్తికరమైన బొమ్మలు వేస్తున్నందుకు కృతజ్ఞతలు. అలాగే కథలు కూడా బాగుంటున్నాయి. న్యాయసలహాలు, రుచి శీర్షికలు రెగ్యులర్‌గా ఇస్తున్నందుకు థాంక్స్.

– పి.ఎస్.ఎస్.కిరణ్, హైదరాబాద్.

మల్టీలెవెల్ దోపిడీ

దోపిడీలు రకరకాలు...

శ్రమదోపిడీ, వాణిజ్యదోపిడీ, సాంస్కృతిక దోపిడీ, దారిదోపిడీ, నిలువుదోపిడీ వగైరా వగైరా....

పూర్వకాలంలో దారిదోపిడీలు జరిగేవని కథల్లో చదివాము.. ఇప్పుడూ జరుగుతున్నాయనుకోండి..

ఆంగ్లేయులు రెండు వందల ఏళ్ళపాటు దేశాన్ని దోచుకున్నారు...

ఇప్పుడు అమెరికా వాడు వాళ్ళకి తోడయ్యాడు...

ప్రపంచాన్నంతా తన చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి చేయని ప్రయత్నం లేదు..

ప్రపంచంలోని జనమంతా తనదేశంలో తయారయ్యే తిండే తినాలి..తన వస్తువులే కొనాలి.. తన ఆయుధాలే ప్రయోగించాలి...తన మాట వినే పాలకులే ఉండాలి....లేకుంటే ఖబడ్దార్ అంటాడు అమెరికా వాడు!....

దేశం ఏదైనా తన సేవే చేయాలి.. ఏ దేశం వాడైనా తమ వస్తువులే వాడుకోవాలి....ఇదే అమెరికా వాడి నేటి సూత్రం..

ఇలా అమెరికా వస్తువులను విదేశాల్లో అమ్మించుకోవడాన్నే ముద్దుగా మల్టీలెవెల్, డైరెక్ట్ మార్కెటింగ్ అని ముద్దుపేర్లు చెబుతుంటారు..

మధ్యలో దళారులెవరూ ఉండరంటారు... నేరుగా కంపెనీయే మనకు వస్తువులు సరఫరా చేస్తుంది సభ్యత్వం తీసుకోండని వెంటబడుతుంటారు.. ఎంతో నాణ్యమైన సరుకని, బోలెడు కమీషన్ వస్తుందని ఆశపెడతారు...

అమెరికా వాడు మొత్తానికి చాలా తెలివైనవాడు...

ఎలాగంటే.... మనం వాడే టూత్‌బ్రష్ ఖరీదు పదో ఇరవయ్యో ఉంటుంది... టూత్‌పేస్ట్ కూడా దాదాపు అంతే ఉంటుంది...

అమెరికా కంపెనీల టూత్‌పేస్ట్ రెండొందలు, బ్రష్ వంద ఉంటాయి.. డాలర్ల రూపంలో ఉండే వాటి ధరలను రూపాయిల్లోకి మార్చి పైసలతో సహా వసూలు చేస్తూ మనకు రిబేటు ఇస్తాయి....

అదే అమెరికాలో అయితే భారీగా ప్రచారం చేసి వందల కోట్లు గుమ్మరిస్తే గాని సరుకులు అమ్ముడు కావు...

మరి ఇక్కడో అమెరికా సరుకంటే చాలు ఎగరేసుకుపోతారు... మోజు అటువంటిది...అదిగో దాన్నే వాడు సొమ్ము చేసుకుంటున్నాడు..

అక్కడ ప్రచారం కావాలి... ఇక్కడ అక్కర్లేదు... అమ్మేవాడే నోటితో ప్రచారం చేస్తాడు... టీవీల్లో చెప్పేకన్నా, పెద్ద హోర్డింగుల్లో చూపించేకన్నా, పేపర్లలో రాసేకన్నా ఈ ప్రచారమే వారికి లాభాలపంట పండిస్తోంది...

బతకడానికి మార్గాలు కనిపించక అల్లాడిపోయే మన నిరుద్యోగులే వారికి సిరుల పంట కురిపిస్తున్నారు....

సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉండే ఆ వస్తువులను అమ్మించడానికి అమెరికా కంపెనీలు మనదేశంలోని నిరుద్యోగుల్ని బాగానే ఉపయోగించుకుంటున్నాయి...

ప్రపంచంలో ఏదేశం వాడినీ వాడి తిండి వాడ్ని తిననివ్వడు, వాడి బ్రతుకు వాడ్ని బ్రతకనివ్వడు, వాడి చావు వాడ్ని చావనివ్వడు.....

పది రూపాయలకు దొరికే బ్రష్‌ను వంద పెట్టి కొంటావా కొనవా అంటాడు...

దీన్ని ఏ రకం దోపిడీ అందాం?....

ఈ సంచికలో . . .

ఓరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
కళాసాహితి	. . . 22
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

వక్రరేఖలు

కథ ... 8, 9

చేతుల్లేని సరస్వతి

రియల్‌స్టోరీ... 14, 15

బైపాస్ సర్జరీ లేకుండానే గుండె జబ్బుల నివారణ

ఆరోగ్యం . . . 18, 19

శిల్పకళా కాణాచి లేపాక్షి

టూరిస్ట్ గైడ్ . . . 21

ఓరా!

ఆడ శిశువుల హత్యల్లోనూ హైటెక్ సిటీయే ఫస్ట్!?

విద్య, వైద్యం, ఐటి, పర్యాటక తదితర అన్ని రంగాల్లోనూ మన భాగ్యనగరం దేశంలో అన్ని నగరాలకన్నా ముందున్నదని ముఖ్యమంత్రి ఎప్పుడూ ఊదరగొడు తుంటారు. ఇపుడు ఈ జాబితాలో మరో అంశం కూడా చేరిందట! దేశంలో పురుషుల కంటే మహిళల సంఖ్య తగ్గిపోతోందని అందరూ ఆందోళన పడుతున్నారు. మన రాష్ట్రానికి వస్తే హైదరాబాద్ నగరంలో ఈ తేడా మరీ ఎక్కువగా ఉందట. రాష్ట్రంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 978 మంది స్త్రీలు ఉన్నారు. ఈ నిష్పత్తి పట్టణాల్లో 965 అయితే, పల్లెల్లో మాత్రం 983గా ఉంది. స్త్రీ, పురుషుల నిష్పత్తిని జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్ అన్నింటికంటే అధమ స్థానంలో ఉంది. ఇక్కడ వెయ్యి మంది పురుషులకు 933 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారు. రెండవ అధమ స్థాయి జిల్లా రంగారెడ్డి. పురుషులకంటే స్త్రీలు ఎక్కువగా ఉంటూ నిజామాబాద్ (1017) ప్రథమ స్థానంలోనూ, శ్రీకాకుళం (1014), విజయనగరం (1009) ద్వితీయ, తృతీయ స్థానంలోనూ ఉన్నాయి. గర్భంలో ఉన్నది ఆడో మగా తెలియచెప్పే స్కానింగ్ సెంటర్లు హైదరాబాద్‌లో మాత్రమే అందుబాటులో ఉండటం వల్ల ఈ మహానగరంలో గర్భంలోనే ఆడశిశువులను హత్య చేస్తున్నారని, పొరుగునే గల రంగారెడ్డి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి దాపురించిందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. చూశారా హైటెక్ సిటీ ఆడ శిశువులను చంపడంలో కూడా ముందే ఉంది.

చందమామ నుండి విద్యుత్?!

భూమికి చేరువలో ఉన్న చందమామను వీలైనమేరకు ఉపయోగించుకోవడానికి మానవులు ప్రయత్నిస్తున్నారు. చంద్రుడిమీద ప్లాట్లు వేసుకుని అమ్ముకోవడానికి కొన్ని కంపెనీలు ప్రయత్నిస్తుంటే అక్కడి హీలియం మూలకాన్ని తెచ్చుకుని భూమిపై రాబోయే విద్యుత్, ఇంధన కొరతను అధిగమించవచ్చని మరికొన్ని కంపెనీలు భావిస్తున్నాయి. 2150 సంవత్సరం నాటికి భూమిపై గల బొగ్గు, ఆయిల్, గ్యాస్, యురేనియం వంటి ఇంధనాలన్నీ ఖర్చయిపోతాయట! మరి ఆ తర్వాత భూమి చీకటి ఖండంగా మిగిలిపోవలసిందేనా? అంత ఇబ్బందేమీ లేదు, చంద్రుడి మీద మనకు వెయ్యి సంవత్సరాలకు సరిపడా విద్యుత్ ఉత్పత్తి చేయగల హీలియం మూలకం ఉందని రష్యన్ శాస్త్రవేత్త ఒకరు చెబుతున్నారు. చంద్రుడిపై హీలియం-3 ఐసోటోపులు 50 కోట్ల టన్నులకు పైగా రెడీగా లభ్యమవుతుందట! అటువంటి మూలకం భూమిపై స్వతహాగా దొరకదట. పైగా హీలియం-3 తో విద్యుత్ తయారు చేస్తే ఎటువంటి కాలుష్యం ఉండదు, అణువిద్యుత్ మాదిరిగా రేడియోధార్మికత ఉండదట! కనుక ఎంతో సురక్షితమైన విద్యుత్‌ను తయారుచేసుకోవచ్చని ఆశపడుతున్నారు. చంద్రుడిపై నుండి తెచ్చిన మట్టి, రాళ్ళు పరీక్షించిన తర్వాత ఈ అంచనాకు వచ్చినట్లు రష్యన్ శాస్త్రవేత్త చెబుతున్నారు. పైగా రెండు అంతరిక్షనౌకల ద్వారా హీలియం-3 తేవడానికి అయిన ఖర్చుకు పదిరెట్ల విలువైన విద్యుత్‌ను తయారు చేయవచ్చని కూడా ఆయన అంటున్నారు. 40 సంవత్సరాలలో ఇందుకు సంబంధించిన ఒక ప్రాజెక్టు వాస్తవ రూపంలోకి రావచ్చని ఆశిస్తున్నారట?!



ఎకె-ఎంపి3

ఎకె-47 రైఫిల్స్ పేరు వినని వారుండ రు. రక్షణబలగాల వద్ద ఉండే ఈ అత్యాధునిక రైఫిల్స్‌ను ఉగ్రవాదులు కూడా చట్ట విరుద్ధంగా వాడుతున్నారు. మన దేశంలో అయితే చిన్న రివాల్వర్ కొనుక్కోవాలన్నా ప్రభుత్వ అనుమతి అవసరం. అనుమతి లేకుండా రివాల్వర్ ఉంచుకుంటే కటకటాలు లెక్కించాల్సిందే. అయితే అమెరికా, ఐరోపా దేశాల్లో షాపుకి వెళ్ళి ఎంచక్కా మనకు కావలిసిన తుపాకులు కొనుక్కోవచ్చు. అక్కడ అంత స్వేచ్ఛ ఉంటుంది మరి. బ్రిటన్‌లోని ఓ కంపెనీ ఓ అడుగు ముందుకేసి ఎకె-47 తుపాకులు దగ్గరుంచు కునే వారికి బోర్ కొట్టకుండా ఉండేందు కని దానికి ఎంపి3 ప్లేయర్ ఎటాచ్ చేసి అమ్ముతోందట. ఒక పక్కన రైఫిల్‌తో కాల్పులు జరుపుతూ దానిలోని ఎంపి3 ప్లేయర్ ద్వారా కావలసిన పాటలు కూడా వినవచ్చు. నిముషానికి 600 రౌండ్లు కాల్చే శక్తి గల ఆ తుపాకీలో మ్యాగజైన్‌లో 9000 పాటలు స్టోర్ చేసుకోగల ఎంపి3 ప్లేయర్ నిక్షిప్తం చేసి అమ్ముతున్నారట! రష్యాలోని ఓ కంపెనీ దీనికి సాంకేతిక సహకారం అందిస్తున్నదట.



ఓటు
మళ్లీ గెలిపిస్తే మందిరం కడతాం: వాజ్‌పేయి
ఎన్నికలు

కార్టూన్ కదంబం



మా బాకీ తీర్చేదెవరో...
ఓడిపోతే ఈ ప్రభుత్వ ఫ్యాక్టరీని ఎలా కాజేయాలి
బొక్కడానికి ఇక బియ్యం దొరకవేమో...
హమ్మయ్య, ఎంత శుభవార్తో...
ఒక వేళ ఓడిపోతే... —పార్టీ సమావేశంలో బాబు



ఇండియా షైనింగ్
ఇండియా బర్నింగ్ సార్!
ఆకలి
అవినీతి
నిరుద్యోగం
నారు

కాల్ సెంటర్స్....

అవుట్‌సోర్సింగ్.. కాల్ సెంటర్స్... ఇటీవల ఈ రెండు పదాలు తరచుగా వినిపిస్తున్నాయి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి; దానికి సంబంధించిన కోర్సులు చదివినవారికి వెంటనే అర్థమవుతుంది. మిగిలినవారికి అర్థం కావడం కొంచెం కష్టమే.. అమెరికా కంపెనీలు ఇతర దేశాలకు అవుట్‌సోర్సింగ్ పనులను ఇవ్వడాన్ని నిషేధిస్తూ ఇటీవల అమెరికా సెనేట్ తీర్మానం చేసినట్లు వార్తలొచ్చాయి. దీని ప్రభావం అక్కడి నిరుద్యోగిత మీద ఎంత ఉంటుందనే అంశంపై అనేక దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. కొందరు నాయకులు చెప్పిన హైటెక్ మాటల మాయలో పడి కంప్యూటర్ మినహా వేరే లోకం లేదు, వేరే పని లేదు అంటూ కంప్యూటర్ విద్య అభ్యసించిన వారంతా ఇప్పుడు డీలా పడుతున్నారు. అమెరికా తీర్మానం వల్ల మనకు వచ్చిన ఇబ్బందేమీ లేదని మన నాయకులు అభయం కూడా ఇస్తున్నారు. ఈ తీర్మానాలు, హామీల మాట ఎలా ఉన్నా అసలు అవుట్ సోర్సింగ్, కాల్‌సెంటర్స్ అంటే ఏమిటో తెలుసుకోవడం అవసరం....

కె.ఎక్స్.రాజు

హలో... హలో..

అని ఫోన్‌కాల్ రాగానే ఎలర్టయి, అవతలివారు ఏ విధమైన పదజాలాన్ని ఉపయోగించినా, వారి మనసు నొచ్చుకోకుండా, వారిని మెప్పించే విధంగా, సున్నితంగా మాట్లాడుతూ... వినియోగదారుల సమస్యలను పరిష్కరించేవారే సిఎస్ఆర్ లేదా ఇసిఆర్ లేదా సిఎస్‌వోలు. పేర్లు ఏవైనా వినియోగదారునికి సేవలందించడమే వీరి కర్తవ్యం. ప్రపంచవ్యాప్తంగా ఎందరి సమస్యలనో తీర్చుతూ మరెందరికో సలహాలు, సూచనలను అందిస్తూ... ఉన్నత విద్యనభ్యసించినా బహుళజాతి సంస్థల దోపిడీకి గురవుతూ తనలోని భావావేశాలను తొక్కిపెట్టి వినియోగదారుని సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేసే ఇ-కూలీల హైటెక్ ఖార్ఖానాలే ఈ కాల్‌సెంటర్లు.

కాల్‌సెంటర్ అంటే...

వస్తు ఉత్పత్తి, సేవా రంగాల్లోని సంస్థలు తమ కార్యకలాపాలకు సంబంధించి రోజూ కొన్ని వేల ఫోన్‌కాల్స్‌ను రిసీవ్ చేసుకొని వాటికి తగు సమాధానాలు ఇవ్వాల్సివుంటుంది. ఈ విధంగా వచ్చే ఫోన్‌కాల్స్‌కు బదులివ్వడం కోసం ఆయా సంస్థలు ప్రత్యేక విభాగాలను రూపొందించుకున్నాయి. అవే నేడు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న కాల్‌సెంటర్లు. ఇటీవలి కాలంలో ఉపాధి అవకాశాలను అపారంగా కల్పిస్తున్న రంగాల్లో ముఖ్యమైనవి ఈ కాల్‌సెంటర్లు. ఒక దేశంలోని కంపెనీలు మరో దేశంలో కార్యాలయాలు నెలకొల్పి అక్కడి వారితో ఆన్‌లైన్‌లో పనిచేయించుకోవడాన్నే అవుట్‌సోర్సింగ్ అంటారు.

సాధారణంగా ఈ కాల్‌సెంటర్లను సంబంధిత కంపెనీలే నిర్వహించడం గానీ లేదా వేరే సంస్థలకు ఆ బాధ్యతలను అప్పగించడంగానీ చేస్తుంటాయి. కాల్‌సెంటర్లలో పనిచేసేవారు ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఇ-మెయిల్స్, ఫోన్స్‌కాల్స్, చాటింగ్‌లకు నిర్ణీత వ్యవధిలోపు తగిన పరిష్కారాన్ని సూచించాల్సి వుంటుంది. ఉదాహరణకు ఐసిఐసిఐ బ్యాంక్‌కు హైదరాబాద్‌లో ఒక కాల్‌సెంటర్ వుంది. తమ కస్టమర్‌కు వచ్చే సమస్యలు, ఖాతాదారుల లావాదేవీలను వారే స్వయంగా పరిష్కరిస్తారు. అమెరికాలో అగ్రస్థానంలో వున్న 20 ప్రముఖ బ్యాంకులు సగటున 23 కాల్‌సెంటర్లను నిర్వహిస్తున్నాయి. ఇటువంటివే మన రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఐసిఐసిఐ, ఎయిర్‌టెల్, హచ్, డెల్, విప్రో, వెబ్‌హెల్ప్, బ్రిగేడ్ సొల్యూషన్స్ వంటి సంస్థలు కాల్‌సెంటర్లను నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ కూడా తమ తమ వస్తూత్పత్తి, సేవా కార్యక్రమాలను ఇదేవిధంగా నిర్వర్తిస్తుంటాయి. మార్కెటింగ్, విక్రయాలు, సాధారణ సమాచారం, సలహాలు, సూచనలు, సాంకేతిక మద్దతు లాంటి ఖాతాదారులకు సంబంధించిన ఫోన్‌కాల్స్‌తో కాల్‌సెంటర్ కార్యకలాపాలు ముడిపడి వుంటాయి.

అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ కార్యకలాపాలను నిర్వహించడం బాగా వ్యయంతో కూడుకున్నది కావడంతో, వీటి నిర్వహణకు అవి వర్ధమాన దేశాలను ఎంచుకుంటున్నాయి. పలు అంతర్జాతీయ సంస్థలు మనదేశం పట్ల అత్యంత ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. దీనికి ముఖ్యకారణం ఇక్కడ వ్యయం తక్కువ వుండడమే. మనదేశంలో 'దినదిన ప్రవర్ధమానం' చెందుతోన్న నిరుద్యోగం దీనికి మరింత ఊతమిచ్చినట్లయింది. దీంతో ఎయిర్‌లైన్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, టెలికం, ఐటీ, టూరిజం, హోటల్స్ వంటి రంగాలకు చెందిన సంస్థలు స్వయంగానూ, భాగస్వామ్య ఒప్పందాల ద్వారానూ మన దేశంలో కాల్ సెంటర్లను

కవర్ స్టోరీ

పనిఒత్తిడి తప్పదు

హైదరాబాద్ మాదాపూర్‌లో నోవా (Knoah) సంస్థ పనిచేస్తోంది. వీరు యుఎస్‌లోని ఎర్త్‌లింక్.నెట్ వారి ఉత్పత్తులకు ఇక్కడనుండి తమ సేవలను అందిస్తున్నారు. ఈ సంస్థలో ఇసిఎస్ (ఎలక్ట్రానిక్ కస్టమర్ సర్వీస్)గా పని చేస్తున్న ఎం.టి.వంశీ తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే...

బ్రౌజర్ కాన్ఫిగరేషన్, ఔట్‌లుక్, నెట్‌స్కేప్ నావిగేటర్, ఇ-మెయిల్స్ ద్వారా వచ్చే ఇబ్బందులు, మార్కెటింగ్, విక్రయాలు, సాధారణ సమాచారం, సలహాలు, సూచనలు, సాంకేతిక మద్దతు వంటివి ఖాతాదారులకు సంబంధించిన ఫోన్‌కాల్స్‌తో ముడిపడివుంటాయి. ఇ-మెయిల్స్ రూపంలోగానీ, ఆన్‌లైన్ చాటింగ్ లేదా ఫోన్ ద్వారా గానీ కస్టమర్స్ సమస్యలకు పరిష్కారం చెపుతుంటాము.

వినియోగదారు నుంచి వచ్చే ఇ-మెయిల్‌కు 24గంటల్లో తగిన పరిష్కారం చూపాలి. దానికి ఒక డాలర్ ఛార్జి చేస్తారు. ఆన్‌లైన్ చాటింగ్‌లైతే వినియోగదారు తన సమస్యను తెలిపిన 20నిమిషాల్లో పరిష్కారం తెలియజేయాలి. దానికి ఐదు డాలర్లు చొప్పున ఛార్జి చేస్తారు.

పని ఒత్తిడి కొంతవరకు నిజమే. మావరకు సర్వీస్ బ్రేక్‌డౌన్స్ వున్న సందర్భాల్లో ఎక్కువ ఒత్తిడి వుంటుంది. ఉదాహరణకు పాప్3, వెబ్‌మెయిల్ వంటి సర్వర్స్ బ్రేక్‌డౌన్ అయినా, అప్‌లోడింగ్ వంటివి జరిగినా 5, 10 నిమిషాలు బ్రేక్ చేస్తాము. అటువంటి సందర్భాల్లో ఈ ఒత్తిడి వుంటుంది. మాసంస్థలో టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో మొత్తం 1000 మంది వరకు వుంటారు.

పశ్చిమదేశాల ఇంగ్లీష్ యాసకు, మనం మాట్లాడే యాసకు కొంత వ్యత్యాసం వుంది. ఏ దేశంలో చూసినా అది కొంత మేరకు కనిపిస్తూనే వుంటుంది. ఉదాహరణకు మన తెలుగునే తీసుకుంటే ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన యాసతో మాట్లాడుతుంటాము. అదీ అంతే. అయితే వినియోగదారుని పదేపదే విసిగించకుండా వాళ్ళు మాట్లాడేది అర్థం చేసుకొని, వెంటనే వారికి తగిన పరిష్కారం చెప్పగలిగితే సరిపోతుంది.

సదుపాయాల గురించి చెప్పవలసివస్తే పికప్ అండ్ డ్రాప్ సదుపాయం వుంటుంది. కొంతమంది వారి వాహనాలనే ఉపయోగిస్తారు. నైట్ డ్యూటీల్లో వున్నవారికి భోజనం, కాఫీ వంటివి ఫ్రీగా సప్లయ్ చేస్తారు. పగలు డ్యూటీలో వున్నవారికి టీ, కాఫీలు ఫ్రీగానే వుంటాయి. భోజనం మాత్రం సొంత ఖర్చులతోనే భరించాల్సివుంటుంది.

కంటిన్యూగా నైట్‌డ్యూటీలు చేయడం వల్ల నిద్రలేమి సమస్య వుంటుంది. అయితే పగలు ఎక్కువగా రెస్ట్ తీసుకోవడం ద్వారా కొంతవరకు రికవర్‌కావచ్చు. 15రోజులు పగలు, 15రోజులు నైట్ డ్యూటీలుంటాయి. ఒక షిఫ్ట్ నుండి మరో షిఫ్ట్‌కి మారడానికి మధ్య ఒక రోజు వేతనంతో కూడిన సెలవు వుంటుంది. రెండు షిఫ్ట్‌లకు మధ్య ఒక సెలవు వుండడం వల్ల తర్వాతి షిఫ్ట్‌కి వెళ్ళేందుకు కావాల్సిన రెస్ట్ దొరుకుతుంది.

నిర్వహిస్తున్నాయి. దేశంలోని అనేక కాల్‌సెంటర్లు ప్రధానంగా విదేశాలపై ఆధారపడి పనిచేస్తుండడంవల్ల పనివేళలు మనకు భిన్నంగా వుంటాయి. కాల్‌సెంటర్లలో పనిచేసేందుకు ఫ్రెష్ గ్రాడ్యుయేట్లకు అవకాశాలు అధికంగా వుంటాయి. 30 ఏళ్ళకు పైబడినవారిని ఉద్యోగంలోకి తీసుకోరు. అవసరమున్నంతవరకు వినియోగించుకొని తర్వాత తొలగించడమనే 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని అవలంబిస్తున్న బహుళజాతి కంపెనీలు కాల్‌సెంటర్ల పేర నిరుద్యోగులను దోచుకుంటున్నాయనే విమర్శలు కూడా వున్నాయి. అందువల్లనే ఏ ఉద్యోగీ రెండు సంవత్సరాలకు మించి పనిచేయడంలేదు. ఏటా 30శాతం మంది వెళ్ళిపోవడం, కొత్తవారు రావడం జరుగుతోంది. కాల్‌సెంటర్లలో పనిచేసేవారు అధిక ఒత్తిడికి గురవుతారని, అందువల్ల ఆఫీసులో వాతావరణం ఆహ్లాదకరంగా వుండేవిధంగా ఆయా సంస్థలు చర్యలు తీసుకుంటున్నాయి. సిబ్బందికి ఉచిత భోజన వసతి, రవాణా, రిక్రియేషన్, మెడికల్ బెనిఫిట్స్ వంటివి కల్పిస్తున్నప్పటికీ అన్ని సంస్థలలోనూ ఒకే విధంగా లేదు. కొన్ని సంస్థలలో ఒక మాదిరి సౌకర్యాలువుంటే మరికొన్ని సంస్థలలో ఫర్వాలేదు అనిపించే విధంగా వుంటున్నాయి.

కెరీర్....

సాధారణంగా కాల్ సెంటర్లలో ప్రారంభస్థాయి ఉద్యోగిని కొన్ని సంస్థలలో కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్ (సిఎస్ఆర్)గా, మరికొన్ని సంస్థలలో ఇసిఎస్(ఎలక్ట్రానిక్ కస్టమర్ సర్వీస్)గా పిలుస్తారు. వీరు ఫోన్, ఇ-మెయిల్, చాటింగ్‌ల ద్వారా వినియోగదారులకు అవసరమయ్యే సర్వీస్‌ని అందిస్తారు. ఒక్కో షిఫ్ట్‌లో 80 నుండి 100వరకూ కాల్స్‌ను అటెండ్ చేయాల్సి వుంటుంది. వీరి వేతనం నెలకు రు. 3,500 నుండి రు. 6,000 వరకు వుంటుంది. ప్రారంభస్థాయి ఉద్యోగి తను చూపే ప్రతిభకు రేటింగ్స్ ఇస్తారు. ఆ రేటింగ్స్ ఆధారంగా పని విధానం ఎలావుందనేది క్వాలిటీ డిపార్ట్‌మెంట్ నిర్ణయిస్తుంది. దాన్ని బట్టే ఆరునెలల నుండి ఎప్పుడైనా తను ప్రమోట్ అయ్యే అవకాశం వుంది.

టీమ్ లీడర్ : ఒక్కో టీమ్ లీడర్ కింద ఏడు నుండి 10మంది వరకు ఇసిఎస్‌లు వుంటారు. సంస్థ నిర్దేశించిన డెడ్‌లైన్స్ ప్రకారం తన టీమ్‌తో పనులు చేయించడం ఈయన పనులలో ప్రధానమైంది. అంతేకాకుండా తన టీమ్‌లోని సభ్యులకు తెలియని విషయాలు కూడా టీమ్‌లీడర్‌కు తెలిసివుండాలి. తన టీమ్‌కు మార్గదర్శకంగా టీమ్ లీడర్ పనిచేస్తాడు. అనుభవాన్ని బట్టి రూ. 12 వేల నుండి రూ. 25వేల వరకు వేతనం లభిస్తుంది.

జూనియర్ మేనేజర్ : టీమ్ లీడర్ పదోన్నతి పొంది జూనియర్ మేనేజర్ అవుతాడు. ఈయన కింద ఐదు నుండి ఏడుగురు వరకు టీమ్‌లీడర్స్ వుంటారు. టీమ్‌లీడర్స్, వారి కింది ఉద్యోగులు కస్టమర్స్‌కు అందించే సేవలను పర్యవేక్షిస్తుంటాడు.

ఆ తర్వాత మేనేజర్, ఆపరేషన్స్ మేనేజర్, సిఇవో వుంటారు. వీరంతా ఎప్పటికప్పుడు తమ కిందిస్థాయి ఉద్యోగులకు తగిన సలహాలనందిస్తూ తమ తమ టార్గెట్లను సాధించేందుకు ఎవరి పరిధిలో వారు కృషిచేయాల్సి వుంటుంది.

ఇసిఎస్‌లు, టీమ్‌లీడర్, జూనియర్ మేనేజర్, మేనేజర్, ఆపరేషన్స్ మేనేజర్, సిఇవో వంటి పేర్లు చిన్నచిన్న మార్పులతో ఒక్కో సంస్థలో ఒక్కో విధంగా వుండవచ్చు. సర్వీస్ క్వాలిటీ, కస్టమర్లతో సంబంధాలు మెయింటెయిన్ చేయడం వంటివన్నీ అన్ని సంస్థలలోనూ ఒకే విధంగా వుంటాయి.

సాధారణంగా ఆయా కాల్‌సెంటర్లు అభ్యర్థుల నుండి కోరుకునే అంశాలు ఇలావుంటాయి. మంచి వినికిడి శక్తి, ఆంగ్లభాషా పరిజ్ఞానం, విధి నిర్వహణ పట్ల ఆసక్తి, ఒత్తిడిని తట్టుకోగలగడం, బృందంలో సభ్యుడిగా నలుగురితో కలిసి పనిచేయగలగడం, రిక్రూట్‌మెంట్ సమయంలో ఆయా సంస్థలు అభ్యర్థులకు ఆప్టిట్యూడ్ టెస్ట్, ఎస్సే రైటింగ్, వాయిస్ టెస్ట్ వంటివి నిర్వహిస్తాయి. చివరిగా ఇంటర్వ్యూలు చేపడతాయి. కంప్యూటర్లను, డేటాబేస్‌లను వినియోగించే విధానం, ఇంటర్నెట్ టెక్నాలజీకి సంబంధించిన ఇ-మెయిల్, చాటింగ్, బ్రౌజింగ్ వంటివి, కాల్‌సెంటర్ టెక్నాలజీస్, ఫోన్‌లో మాట్లాడే విధానం, విదేశీ యాసను అర్థం చేసుకోవడం, వేగంగా చదవడం, మాట్లాడడం, ఒత్తిళ్ళను అధిగమించడం వంటి అంశాల్లో ప్రావీణ్యం వుండాలి.

భారతదేశంలో కాల్‌సెంటర్ రంగం బాగా విస్తరిస్తోంది. విదేశీ సంస్థలతోపాటు దేశీయ సంస్థలు కూడా తమ అవసరాలకు అనుగుణంగా కాల్‌సెంటర్లను నెలకొల్పుతున్నాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో చిన్నా, పెద్ద కాల్‌సెంటర్లు పనిచేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా కోటిన్నరమందికిపైగా ఈ రంగంలో పనిచేస్తున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ అంచనా వేసింది. 2001-2002లో మనదేశంలో కాల్‌సెంటర్



పరిశ్రమ రూ.850 కోట్ల మేరకు ఆదాయాన్ని ఆర్జించింది. 2008 నాటికి రూ.20వేల కోట్ల మేరకు ఆదాయాన్ని ఈ పరిశ్రమ ఆర్జించగలదని, 2.7కోట్ల మందికి ఉపాధి అవకాశాలను కల్పించగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఈ ఉద్యోగం సాధారణంగా 8 గంటల షిప్టుగా వుంటుంది. అంటే ఎనిమిది గంటల చొప్పున రోజుమొత్తం మీద ముగ్గురు పనిచేస్తారు. 24 గంటలూ పనిచేసే కాల్ సెంటర్లు వినియోగదారులకు ఏ సమయంలోనైనా, ఏ రోజులోనైనా సర్వీస్‌ని అందిస్తాయి. ఈ ఉద్యోగం చేసేవారు సాధారణంగా తమకు అనుకూలంగా వుండే 8 గంటల షిఫ్ట్‌ని ఎంచుకునే అవకాశం కూడా వుంటుంది. ఒక్క గంట కూడా ఎక్కువ పనిచేయవలసిన అవసరం వుండదు. కానీ డ్యూటీలో వున్న 8 గంటలు మాత్రం పని ఒత్తిడి చాలా ఎక్కువగా వుంటుంది. సాధారణంగా ఒక కాల్ మాట్లాడుతుండగానే మరో వినియోగదారుడు లైన్‌లో వేచివుంటాడు. ఈ విధంగా ప్రతిరోజూ కనీసం 100 కాల్స్ వరకూ రిసీవ్ చేసుకోవాల్సి వుంటుంది. అదేస్థాయిలో చాట్ సెషన్లకు కూడా అటెండ్ కావాల్సివుంటుంది. వారు వినియోగదారుని అవసరాలు తీర్చే ఉద్యోగంలో వున్నారు కనుక ఎట్టి పరిస్థితుల్లోనూ చిరాకు పడకుండా, విసుగు చెందకుండా, మొదటి కాల్ నుంచి చివరి కాల్ వరకూ ఎంతో మర్యాదగా జవాబు ఇవ్వాల్సి వుంటుంది. ఎవరైనా వినియోగదారుడు రెచ్చగొట్టేవిధంగా మాట్లాడినా ప్రశాంతంగా సమాధానం ఇవ్వాల్సివుంటుంది.

దక్షిణాఫ్రికా కంపెనీలు బ్రిటన్ నుండి అవుట్‌సోర్సింగ్ కోసం ప్రయత్నిస్తుండటంతో భారత కాల్‌సెంటర్లకు పోటీ ఎదురుకానుంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా కూడా బ్రిటన్ కంపెనీల నుండి అవుట్‌సోర్సింగ్‌ను కోరుతోంది. వ్యాపారాన్ని స్వాధీనం చేసుకోవడం కోసం దక్షిణాఫ్రికా కంపెనీలు అనేక పథకాలను కూడా ప్రకటిస్తున్నాయి. దీంతో భారత కంపెనీలకు వ్యాపారం తగ్గే అవకాశాలున్నాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరో రెండు సంవత్సరాల్లో దక్షిణాఫ్రికా కూడా భారత్ వలే ఈ రంగంలో ప్రాబల్యం సంపాదిస్తుందని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు.

శిక్షణ

నేడు ఎన్నో సంస్థలు కాల్‌సెంటర్ రంగంలో శిక్షణనిస్తున్నాయి. అయితే ఇలాంటి సంస్థల్లో శిక్షణ పొందే ముందు అభ్యర్థులు గమనించాల్సిన అంశాలు – శిక్షణ ఇవ్వడానికి ఆ సంస్థ వద్ద సరైన ఫ్యాకల్టీ వుందా, లైబ్రరీ, ఆడియో, వీడియో ఉపకరణాలతో కూడి శిక్షణ లభిస్తుందా, అభ్యర్థుల ఆంగ్లభాషా పరిజ్ఞానాన్ని పెంచడానికి ఆ శిక్షణ తోడ్పడుతుందా,; విదేశీ యాస అర్థం చేసుకోవడానికి అవసరమైన శిక్షణను ఆ సంస్థ అందిస్తుందా, ఆ సంస్థకు గల గుర్తింపు, ఇప్పటివరకు ఆ సంస్థ ద్వారా శిక్షణ పొందినవారు ఎక్కడెక్కడ, ఏ హోదాల్లో పనిచేస్తున్నారు, కాల్‌సెంటర్ సేవలను అందించే సంస్థలతో శిక్షణ ఇచ్చే సంస్థలకు ఏవైనా టైఅప్‌లు వున్నాయా, శిక్షణ ఎంతకాలం వుంటుంది, ఫ్యాకల్టీ సభ్యుల శక్తి సామర్థ్యాలు, అనుభవం, ఎంతకాలంగా ఆ సంస్థ ఈ తరహా శిక్షణను అందిస్తోంది వంటి అంశాలన్నింటినీ అభ్యర్థులు గమనించాలి. లేని పక్షంలో వేల రూపాయలు చెల్లించి పొందిన శిక్షణ ఎందుకూ కొరగాకుండా పోతుంది.

ప్రస్తుతం మన దేశంలో ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు, ముంబాయి, హైదరాబాద్‌ల వంటి అన్ని ప్రధాన నగరాల్లో ఈ కాల్‌సెంటర్ శిక్షణాసంస్థలు నెలకొన్నాయి. విదేశీ యాసలను అర్థం చేసుకోవడం, వివిధ ఉపకరణాల వాడకం, డేటాబేస్ నిర్వహణ, వినియోగం, ఆయా సేవారంగాల ప్రాథమిక భావనలపై శిక్షణ వుంటుంది. కంప్యూటర్ వాడకానికి సంబంధించి విండోస్, వర్డ్ వంటి వాటిల్లో శిక్షణ ఇస్తారు. కోర్సు ఫీజు ఆరువేల రూపాయల నుండి పదిహేనువేల రూపాయల వరకు వుంటుంది. కాల్‌సెంటర్ సేవలందించే కొన్ని సంస్థలు స్వయంగా అభ్యర్థులను ఎంపికచేసుకొని వారికి తమకు కావాల్సిన విధంగా శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి తమవద్దే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. ✦



విజయ్

మూడు నిమిషాలకొక కాల్

ఐసిడిఎస్ సెక్యూరిటీ లిమిటెడ్‌కు అనుబంధంగా వున్న స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్‌లో సిఎస్‌ఒ (కస్టమర్ సపోర్ట్ ఆఫీసర్)గా పని చేస్తున్న విజయ్ బి.కాం కంప్యూటర్స్ చదివారు. ఈయన గత 7నెలలుగా ఈ సంస్థలో పని చేస్తున్నారు. ముఖ్యంగా వినియోగదారులకు అవసరమైనంత వరకు సేవ చేయడం మా ప్రధాన విధిగా వుంటుంది. ప్రతి మూడు నిమిషాలలోపు ఒక కాల్ క్లియర్ చేయాల్సివుంటుంది. రోజుకు కనీసం 100కాల్స్ వరకు రిసీవ్ చేసుకోవాల్సి వుంటుందని ఆయన చెప్పారు.

తన పేరును వెల్లడించడానికి ఇష్టపడని మరో సిఎస్‌ఒ మాట్లాడుతూ తను బి.ఎస్సీ చదివానని, గత 8 నెలలుగా ఇక్కడ పని చేస్తున్నానని చెప్పారు. అంతేగాకుండా డ్యూటీకి అటెండ్ అయిన తర్వాత లంచ్ టైమ్ అరగంట తప్పితే ఎటువంటి విరామ సమయం వుండదని, దీనివల్ల కొంత ఇబ్బందికరంగా వుంటుందని ఆయన చెప్పారు. తాము చేసే 8 గంటల పనే కాకుండా అదనంగా చేయాల్సివుంటుంది. దీనికి ఎలాంటి వేతనం వుండదు. అయితే జాబ్ ప్రమోషన్స్ సమయంలో దీన్ని పరిగణనలోకి తీసుకుంటారని ఆయన చెప్పారు.



అనిత

శిక్షణ ఇస్తుంటాను

ఐసిడిఎస్ సెక్యూరిటీ లిమిటెడ్‌కు అనుబంధంగా వున్న స్టాండర్డ్ ఛార్టర్డ్ బ్యాంక్‌లో ట్రైనర్‌గా పని చేస్తుంటారు. తమ సెంటర్‌కు వచ్చే కాల్స్‌ను అబ్జర్వ్ చేస్తుండడం, ఏమైనా సమస్యలు ఎదురైతే వాటికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వడం చేస్తాను. కొత్తగా జాయిన్ అయిన వాళ్ళకు అవసరమైన ట్రైనింగ్ ఇవ్వడం, కొత్త కొత్త పాలసీలను అధ్యయనం చేసి సిఎస్‌ఒలకు ట్రైనింగ్ ఇవ్వడం చేస్తుంటానని అనిత చెప్పారు. మెడికల్ అలవెన్సులు ఒక సంవత్సరం దాటిన వారికి మాత్రమే ఇస్తారని ఆమె చెప్పారు.

30 ఏళ్ళకు పూర్వమే....

అవుట్‌సోర్సింగ్ ప్రక్రియ అమెరికాలో 30 ఏళ్ళకు పూర్వమే ప్రారంభమైంది. ఉపాధి కల్పనకు సంబంధించి అప్పట్లో అమెరికాలో దీని గురించి పట్టించుకున్నవారే లేరు. ప్రపంచంపై అమెరికా పెత్తనం పెరగడం, వర్ధమానదేశాలు ఆర్థికంగా దివాళా తీయడం, నిరుద్యోగ భూతం స్వైర విహారంతో 1990వ దశకంలో కాల్‌సెంటర్లకు ఒక గుర్తింపు వచ్చింది. ప్రపంచీకరణ, ఆర్థిక సంస్కరణల కారణంగా గత మూడేళ్ళుగా ప్రపంచంలోని అన్ని దేశాలు అవుట్‌సోర్సింగ్‌ను ఒక ఉపాధిగా గుర్తిస్తున్నాయి. ఈ రోజుల వేలకోట్ల డాలర్ల పరిశ్రమగా రూపుదిద్దుకుంది. ప్రస్తుతం అమెరికాలోని సుమారు 70 వేల కాల్‌సెంటర్లలో 70 లక్షల వరకు పనిచేస్తున్నారు. ఒకనాడు అమెరికాకే పరిమితమైన కాల్‌సెంటర్లు ఈనాడు ప్రపంచవ్యాప్తంగా ఏటా 20 నుండి 30 శాతం వరకు విస్తరిస్తున్నాయి. బహుళజాతి కంపెనీలకు తక్కువ ఖర్చుతో సేవ చేసిపెట్టడానికి ఏర్పడిన ఈ అవుట్‌సోర్సింగ్‌ను చూపించే మన పాలకులు ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయని చంకలు గుద్దుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా కాల్‌సెంటర్లలో పనిచేసే వ్యక్తికి సగటున ఏడాదికి 20 వేల డాలర్ల వేతనం లభిస్తోందని ఒక అంచనా. ఆయా కంపెనీలు దండుకునే లాభాలతో పోల్చినా, రాత్రికి పగటికి తేడా లేకుండా వారు చేసే శ్రమను చూసినా ఈ వేతనం తక్కువే. దేశాల వారీగా చూస్తే ఆస్ట్రేలియాలో సగటున 17వేల డాలర్లు, జపాన్‌లో 32వేల డాలర్లు, తైవాన్‌లో 28వేల డాలర్లు, అమెరికాలో 26 వేల డాలర్లు, హాంగ్‌కాంగ్‌లో 24వేల డాలర్లు, సింగపూర్‌లో 22వేల డాలర్లు, ఇంగ్లాండ్‌లో 19వేల డాలర్లు, న్యూజిలాండ్‌లో అతి తక్కువగా 15వేల డాలర్ల వేతనం సగటున ఇస్తున్నారు. ఈ దేశాలతో పోలిస్తే భారత్‌లో మరీ తక్కువ వేతనాలు ఇస్తున్నారు.

వక్రరేఖలు

శ్రీచరణ్‌మిత్ర



సింహాద్రి ఒక్క ఉదుటన ముందుకు తొయ్యగానే పదేళ్ల సూరిగాడు వెల్లకిలా పడిపోయాడు. పడిపోయిన వాడింకా తేరుకోకముందే వాడి రెక్కపట్టుకుని బరబరా ఈడ్చేస్తూ, వాడి రెండు చెంపలపై దబదబా బాదేశాడు సింహాద్రి.

"...లం...కొడకా... మళ్లీ పుత్తకాలకని పైసలడిగినవో నీ పేనాలు తీసెత్తాను ఏటనుకున్నావో, నీ బాబు కలెక్ట్రు ఉద్యోగం సేత్తన్నడనుకున్నావేట్రా... అసలు నిన్నని నాథం నేదు పుత్తకాలు ఆళ్లే ఇత్తారు, ఆళ్లే ఉసితంగా సదువు సెప్తారు అని పనిమానిపించి... నిన్ను ఇస్కూలు బడిలో సేర్సిన ఆ దొంగ.... మీ అమ్మను తన్నాల" అంటూ ఇంకా ముందుకు ఉరకబోతున్న తండ్రి వంక బెదురుచూపులు చూస్తూ నిస్సహాయంగా నిలబడిపోయాడు సూరిగాడు.

నూరిగాడు చదువు విషయంలో తండ్రిని ఎలాగైనా ఒప్పించాలనుకుంటాడు. అన్ని పుస్తకాలు కొనమనలేదు అయ్యా, పుస్తకాలు రాబోతప్పటికి రెండు,మూడు నెలలు పడతాది, అందాక పాఠాలు రాసుకోవడానికి ఒక్కొక్క నోటుబుక్కు కొనమని మాస్టారు సెప్పిండు" "ఆడికేటి? ఆడు ఎన్నైనా సెబుతాడు. ఆడి మూట దగ్గర ముళ్లేటి ? ఎదవది మొన్నొక బొక్కు అన్నావు మళ్లీ ఈ రోజు ఇంకొక బొక్కు. రేపు మరొక బొక్కు... నాయాల్ది ఇంక నువ్వు సదివిన సదువు సాలుగానీ బేంజారి నా కొడకా, ఎల్లి పని సేసుకో" చెప్పాడు సింహాద్రి

"నేను పని సెయ్యను. సదువుకుంటాను'' వెక్కుతూనే తీవ్రంగా జవాబిచ్చాడు సూరిగాడు. ఆ మాటతో సింహాద్రికి మరింత చిర్రెత్తుకొచ్చింది. వాడికి సూరిగాడు చదవడం అంటేనే ఇష్టం ఉండదు. "నీయ... ఏంట్రా సదువుకుంటావు ? సదువుకుంటాడంట సదువు... నీవు దేంతో సదువుకుంటావో ఇప్పుడే సూత్తాను" అంటూ గోడకు వేళ్లాడుతున్న పుస్తకాలున్న గుడ్డ సంచీని అందుకుని ఇంట్లో మండుతున్న కట్టెల పొయ్యిలోకి విసురుగా విసిరేశాడు సింహాద్రి.



''అయ్యా అంటూ పరుగెడుతున్న సూరిగాడి రెక్కపట్టుకుని, సింహాద్రి వాడిని ముందుకు పోనీయకుండా ఆపేశాడు. సింహాద్రి చేతిలో సూరిగాడు తన బలాన్నంత ఉపయోగించి పుస్తకాలు పూర్తిగా కాలకముందే తీసుకోవాలనుకుంటున్నాడు. కానీ వీలు కావడం లేదు.

''అయ్యా, అయ్యా పుస్తకాలు కాలిపోతున్నయి అయ్యా, నీవు బొక్కులు కొనొద్దయ్యా, అయ్యా పుస్తకాలు కాలిపోతన్నయి అయ్యా, అయ్యా" అంటూ సూరిగాడు సింహాద్రి చేతిలో దీనంగా అరుస్తున్నాడు.

వాడు అరుస్తూనే ఉన్నాడు. పుస్తకాలు కాలిపోతూనే ఉన్నాయి. చివరికి కాలిపోయాయి. బయటకు ఎక్కడికో వెళ్లిన సూరిగాడి తల్లి అప్పుడే వచ్చింది.

తల్లిని చూడగానే వాడికి ఒక్కసారిగా దు:ఖం, ఉద్వేగం, ఉద్రేకం తన్నుకొచ్చాయి. సింహాద్రి చేయి ఒక్కసారిగా విదిలించుకుని తల్లి కాళ్లకు చుట్టుకుపోయాడు సూరిగాడు.

"అమ్మా, నా పుస్తకాలు కాల్చిశాడే, నా పుస్తకాలన్నీ కాలిపోయాయి" బావురుమంటూ చెప్పాడు సూరిగాడు. "ఎవర్రా ఎందుకు కాల్చిశారు" ఆత్రుతగా అడిగింది ఆమె

"అదిగో ఆ లం...కొడుకు.. అయ్య లం...కొడుకు కాల్చిశాడు" ఉక్రోశంతో సూరిగాడు అలా

అనగానే సింహాద్రి మరింత దూకుడుగా వాడి మీదకు లంఘించాడు. తల్లి అడ్డుకునే ప్రయత్నంలో ఉండగానే సూరిగాడి లేత శరీరంపై సరుగుడు పేడుతో ఎర్రగా వాతలు తేలాయి. "నన్ను లం...కొడుకు అంటావ్రా... ఎదవ నాకొడక... పేగులు తీసేత్తాను జాగ్రత్త. అమ్మో అబ్బుల్ని తిట్టమనేంట్రా సెబుతోంది మీ ఇస్కూలుబడి. నీవు బడికి ఎల్లొద్దు. ఎల్లినావంటే ఎదవ నా కొడకా ఈ ఇంట్లో నీకు ఎంగిలి మెతుకులు కూడా దొరకవు... జాగ్రత్త" అంటూ సూరిగాడ్ని కొట్టిన సరుగుడు బద్దను విసిరేసి బయటకు వెళ్లిపోయాడు సింహాద్రి.

నీరు నిండిన కళ్లతో సూరిగాడి కేసి చూసింది వాడి తల్లి.

"అయ్యనట్టా తిట్టొచ్చంట్రా సూరిగా అట్టా ఎదిరించొచ్చా...? అతి కష్టంగా గొంతు పెగుల్చుకుని అడిగిందామె. ఆమె అలా అడిగిన వెంటనే సూరిగాడిలో దుఃఖం మరింతగా పెల్లుబికి వచ్చింది – " అయ్య ఉత్తి పున్నేనికి అన్యాయంగా నన్ను కొట్టి నా పుస్తకాలు కాల్చేశాడు. అన్యాయాన్ని ఎదిరించ కూడదంటే అమ్మా, అది తప్పెందుకవుతాది ?"

"తప్పేనయ్యా, అన్నేయాన్ని మనలాంటోళ్లు ఎదిరించకూడదు. ఎదిరిస్తే మనలాంటోళ్లం పూర్తిగా అన్నేయం అయిపోతాం. మీ అయ్య పుస్తకాలు కొనలేకే కదా నిన్ను బడి మానేయమన్నాడు. ఆడ్ని నీవు ఎదిరించబట్టే కదా నీ పుస్తకాలు కాల్చేశాడు. ఇప్పుడు ఒక్కసారిగా అన్ని పుత్తకాలు ఎలా కొనగలవురా సూరిగా.... మన బతుకులట్టాంటివి. మీ అయ్యకి ఇష్టం లేని పని సేత్తే ఇట్టాగే సంపుకతింటాడు. వద్దురా నీవు సదవొద్దు. ఆ పుత్తకాలన్నీ నేను కొనలేను. సదువుతానన్న కొడుకుని సదవనివ్వకపోవడం అన్నేయమే అయినా, ఆ అన్నాయాన్ని మనం ఎదిరించలేంరా, అన్నేయాన్ని ఎదిరిస్తే మనికి అన్నం మెతుకులు కూడా దొరకవు" అంటూ రోదిస్తున్న తల్లివైపే చూస్తూ ఉండిపోయాడు సూరిగాడు.

వాడి లేత మనసుపై ఆ రోజు నాటుకుంది ఒక 'నగ్నసత్యం'

'అన్యాయాన్ని పేదవాడు ఎదిరించకూడదు'

ఇలా ఎన్నోసార్లు జరిగిన సంఘటనలతో వాడి హృదయంలో బలంగా ఆ విషయం నాటుకపోయింది. "పేదవాడు అన్యాయాన్ని ఎదిరించకూడదు".

నీలం రంగు నిక్కరుపై పాలనురగలాంటి తెల్లని షర్టును ఇన్‌సర్టు చేసి, దానిపై మరొక నీలం రంగు 'టై' కట్టిన ఆ కాన్వెంటు విద్యార్థి చూడటానికే దొరబాబులా ఉన్నాడు. కాళ్లపిక్కలను తాకే తెల్లని సాక్సులకు నల్లగా నిగనిగలాడే బూట్లు బిగించిన ఆ అబ్బాయి నడిస్తేనే కందిపోతాడన్నట్లుగా పెంచుతారు ఆ అబ్బాయి తల్లిదండ్రులు.

చదివేది నాలుగో తరగతే అయినా నలభై పుస్తకాల వరకైనా మొయ్యాల్సి ఉంటుంది. ఆ అబ్బాయి చదివేది ఖరీదైన ఒక కాన్వెంట్. ఎన్ని ఎక్కువ పుస్తకాలు పిల్లల వద్ద ఉంటే అంత బాగా చదువు చెబుతారు అను కోవడం కోసం అవసరం ఉన్నా, లేకపోయినా పిల్లలచేత గాడిద బరువులు మోయిస్తారు ఆ కాన్వెంటువాళ్లు.

ఒక చేతిలో కేరియర్, భుజానికి వాటర్‌బ్యాగు, నడుంమీద బ్యాగులో నాట్యమాడే పుస్తకాలు. ఇదీ ఆ అబ్బాయి కాన్వెంటుకెళ్లాలంటే ధరించాల్సిన విశ్వరూపం.

కానీ, ఆ అబ్బాయికి అలాంటి అవసరం లేదు.. ఆ అబ్బాయి పనికే కాక, ఆ ఇంట్లో అందరి పని చేయడానికి ఈ మధ్యనే సూరిగాడిని వాళ్ల అయ్య పనికి పెట్టేశాడు.

బాబుగారి బూట్లు పాలీష్ చేయడం మొదలుకొని, అమ్మగారికి అవసరమైన పనులు, అలుపు అన్నది బయటకు కనబడకుండా చేయడానికి చిన్నబ్బాయి గారి పుస్తకాలు, కారియర్, వాటర్‌బ్యాగు

మొదలైనవి మొయ్యడానికి అన్నింటికి వాడే పని చెయ్యాలి. అయితే పేదరికానికి బలైపోయి, జీవితంలో చిన్నప్పుడే కొండంత స్తబ్ధతను నింపుకుని దిగాలుపడ్డ సూరిగాడి ముఖాన్ని చూస్తే ఆ యజమానురాలికి కొండంత చిరాకుగా ఉంటుంది. "లోపలింకా ఏం చేస్తున్నావురా" అన్న యజమానురాలి కేకవిని కంగారుగా బయటకు వచ్చాడు సూరిగాడు "బాబు కాన్వెంటుకు టైమవుతుందిరా ? ఏమిటింకా లేటు ? ఏం చేస్తున్నావు లోపల ?" అంటూ ఉరిమి చూసిందామె " లోపల గళాసులు కడుగుతున్నానమ్మ గారూ" దిగాలుగా చెప్పాడు సూరిగాడు

ఊ సరే ఉద్ధరించేవు గానీ, బాబుతో బయల్దేరు. కాన్వెంటుకు దిగబెట్టగానే వెంటనే వచ్చేయాలి అర్థమయిందా ? ఇంట్లో బోలెడంత పని ఉంది." అంటూ హడావిడిగా ఆర్డరు వేసి, లోపలికి వెళ్లబోతున్న ఆమె ఆ దృశ్యాన్ని చూసి ఠక్కున ఆగిపోయింది.

కేవలం సరదాగా వాటర్‌బ్యాగు పట్టుకున్న తన కొడుకు దగ్గరకు వచ్చి లాలనగా "ఛ...ఛ... వాటర్‌బ్యాగు నువ్వు పట్టుకోవడమేమిటి నాన్నా... వదిలేయ్... సూరిగాడు అన్నీ పట్టుకొస్తాడుగా" అంది

"ఇవన్నీ పట్టుకుని సూరిగాడు వేగంగా నడవలేడు మమ్మీ.... అందుకే వాటర్‌బ్యాగు చాలాసార్లునేనే పట్టుకుంటాను" అన్నాడా అబ్బాయి.

ఆ విషయం విన్న యజమానురాలు కోపంతో ఊగిపోయింది. "వాటర్ బ్యాగు నీవు పట్టుకుంటావా ? నువ్వెందుకు పట్టుకోవడం ? పని చెయ్యడానికి వాడికి మనం డబ్బు ఇస్తున్నాం. నెలలో ఒక్కరోజు జీతం డబ్బులు లేటయితే చాలు వాళ్ల నాన్న పీకల మీద కూర్చుంటాడు. జీతం ఇచ్చి వీడిని ముప్పొద్దులా మేపేది మన సామాన్లు మనం మోసుకోవడానికి కాదు, మనం జీతం ఇచ్చేది మన పనులు చేయించుకోవడానికి. 'అర్థమయింది' అన్నట్టుగా తల ఊపాడు ఆ అబ్బాయి. అలాంటి విషయాలు అర్థం కావడానికి ఆ అబ్బాయి తల్లిదండ్రులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తారు.

ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టుగా ఆ అబ్బాయి మీద కోపం సూరిగాడి వైపు మళ్లింది.

"ఇదిగో చూడబ్బాయి. ఇక మీదట వాడి చేత ఏ వస్తువులైనా మోయించినట్టు తెలిసిందా నీ వీపు చీరేస్తాను. ఏమిటనుకున్నావో ? ఈ పనికూడా తీసేస్తే ఇక్కడ దొరికే ఆ నాలుగు మెతుకులు కూడా దొరకక అపుడు వళ్లు వంగుతుంది. జాగ్రత్తగా మసులుకో" అంటూ సూరిగాడికి చెప్పి వెళ్ళిపోయిందామె.

చినబాబు దగ్గర ఉన్న వాటర్ బ్యాగు కూడా చేతబట్టుకుని "పదబాబూ' అంటూ ముందుకు దారితీశాడు సూరిగాడు.

ఈ సమాజంలో రకరకాలుగా విచారించవల్సిన సంఘటనలలో అత్యంత విషాదకరమైన దృశ్యాలలో ఇలాంటివి కొన్ని. ఒకే వయసు, ఒక ఈడు ఉన్న పిల్లలలో కూడా ఒకడు యజమాని, మరొకరు సేవకుడు కావడం ఆ చిన్న వయసులోనే వారికి ఆర్థిక అసమానతలు తెలియడం.

ఆ పుస్తకాలు మోస్తున్నందుకు సూరిగాడికి ఆనందమూ, దిగులూ ఒకేసారి కలుగుతాయి. అన్ని పుస్తకాలు తను పట్టుకున్నందుకు కలిగే ఆనందం ఒకవైపు ఉన్నా, 'ఆచదువు తనకు రాదు' అన్న దిగులు. బాధ సూరిగాడిలో అధికంగా ఉంటుంది.

అయినా వారు చెప్పిన పనులన్నీ చేయాలి. అప్పుడైతేనే వారు అన్నం పెడతారు. పని ఉంచుతారు. ఆ భావన సూరిగాడి మదిలో ఏనాడో బలంగా నాటుకుపోయింది.

ఒక రోజు.....

కాన్వెంటుకు లేటయిన చినబాబు చాలా

(మిగతా 15వ పేజీలో)

వస్తు మాయాజాలం

ముదిగంటి సుజాతారెడ్డి

ఈ మధ్య ఒక పెండ్లి ఫంక్షన్లో మా దూరపు బంధువు అనిత కలిసింది.

"ఏం అనితా! ఎట్లా వున్నావు? పిల్లలంతా అమెరికాలో వున్నారు కద. నీకెట్లా పొద్దు పోతున్నది? ఏం చేస్తున్నావ్?" అని అడిగాను.

"అయ్యో! నాకు పొద్దుపోకపోవడం అనే సమస్యే లేదు" అంది సంతోషంగా.

''అవునా! అయితే అదృష్టవంతురాలివి. ఏం చేస్తున్నావేంటి''? అడిగాను.

"నేను ఆధ్యాత్మికం క్లాసులు అటెండు అవుతున్నాను. వాళ్ళ ఉపన్యాసాలు వినటం – ఆ ఉపన్యాసాల క్యాసెట్లు కొనుక్కొని ఇంట్లో కూడా వినటం చేస్తుంటాను. వాటితో నాకు చాలా తృప్తి, ఆనందం కలుగుతున్నాయి" అంది అనిత. నిజంగానే ఆమె ముఖం మీద ఆనందం, శాంతి కన్పించాయి.

నేను అనిత ముఖం వైపు చూస్తూ ఆమె ఎంత శాంతీ సుఖాలను అనుభవిస్తూ వుంది! అని ఆశ్చర్యపోతున్నాను – ఇంతలో మళ్ళా అనితే మాట్లాడటం మొదలుపెట్టింది.

"సుశ్మీ! వాళ్ళు చెప్పే విషయాల్లో ఒకటి నాకు చాలా ఇష్టమైందే! – ఎవరికైనా సరే ఎటువంటి దానం చేయకూడదని వాళ్ళు చెప్తారు. అట్లా దానం చేస్తే సోమరిపోతులై పనికి ఒంగరు... పని చేయటం మానేస్తారు అని వాళ్ళు చెప్పింది నాకు నిజమనిపించింది. అందుకే నేను ఎవరికీ ఏమీ దానం చేయటం మానేశాను. మొన్నేమైందనుకున్నావ్ – కారు డ్రైవర్ రాలేదారోజు. షాపింగు చేసి ఆటోలో ఇంటికి వెళ్ళాను. మా ఇల్లు దూరం నీకు తెలుసు కద! ఇంటిముందు ఆపినంక ఆటోడ్రైవర్‌కు మీటరు చూసి పైసలిచ్చాను. ఇచ్చిం తర్వాత వెళ్ళిపోకుండా "అమ్మా! చాలా సామానుతో చాలా దూరం తీసుకువచ్చారు. ఇంత దూరమని నేననుకోలేదు. 'చాయ్ పైసలు ఇప్పిచ్చుండ్రి' అని అడిగాడు. నేను ఉత్త పుణ్యానికి ఎవరికీ దానం చేయను. మా గురువులు చెప్పారు. వెళ్ళిపో అన్నాను. అతను మొండివాడు వెళ్ళిపోక – అయితే! అమ్మా పైసలియ్యకపోతే ఇంత చాయ్ పోయించ్రి తాగిపోతాను – అన్నాడు. ఉత్త పుణ్యానికి నేను ఏదీ ఇయ్యను వెళ్ళిపో! – అన్నాను. అట్లా ఏ పనీపాటా లేకుండానే జనం పైసలు, తిండీ అడుగుతారు! అట్లా జనానికి దానం చేయటం తప్పని అందరూ తెలుసుకోవాలి..." అంది అనిత.

ఆమె మాటలు విని కొయ్యబారిపోయాన్నేను. ఏ మతమైనా ఏ ఆధ్యాత్మిక చింతన అయినా ఏదో రూపంగా ఇతరులకు పెట్టండి, ఇతరులతో తమ సంపదను పంచుకోండి అని చెప్తుంది. కాని ఇటువంటి ఆధునిక ఆధ్యాత్మిక బోధనలు వినేనా అనిత అంత సుఖశాంతులతో సంతోషంగా కన్పిస్తున్నది!–అనుకున్నాను. అనితకున్న సంపత్తి గురించి అందరికీ తెలుసు. పిల్లలందరూ బాగా అమెరికాలో సెటిల్ అయి కావలసినంత సంపాదిస్తున్నారని అందరికీ చెప్తూనే వుంటుంది అనిత. పిల్లలేం ఆమె ఆస్తి కావాలనే స్థితిలో లేరు. వాళ్ళది వాళ్ళు సంపాయించుకొనే ఆత్మవిశ్వాసంతోనే వున్నారు. అనిత కూడా ఒకరికి పెట్టే ఒకరిని ఆదుకునే స్థితిలోనే వుంది. ఇతరుల అవసరానికి ఆదుకొని ఆనందాన్ని పొందే బదులు అనిత ఈ విధంగా ఉత్త పుణ్యానికి ఎవరికీ ఏమీ ఇయ్యకూడదనే మాటను విని అక్షరాలా ఆచరణలో పెడ్తున్నందుకు నేను దిమ్మెరపోయాను.

అంతేగాదు! అనిత ఆ ఆచరణ వల్ల తన సంపద తరగటం లేదని, దోచుకోబడటం లేదనే తృప్తితో ఆనందాన్ని అనుభవిస్తున్నది. ఆహా! ఎటువంటి ఆధ్యాత్మిక బోధనలు బయలుదేరుతున్నాయి! – అని మనస్సులోనే ఆశ్చర్యపోయాన్నేను. నలుగురికి ఉపయోగపడాలనే జీవిత ధ్యేయాన్ని నిరోధించే నిరాకరించే ఈ ఆధ్యాత్మిక బోధన ఏం బోధన! ఫంక్షన్ అయిపోయిం తర్వాత బయటికి వచ్చాను. నా వెనుకనే వుంది అనిత "సుశ్మీ! రా. నిన్ను నా కార్లో విడిచిపెడ్తాను" అంది ఇద్దరం ఆమె కారు దగ్గరికి నడిచాం.

"సుశ్మీ! చూచావా ఈ కారు! బెంజ్. ముప్పై లక్షల కారు! బాగుంది కదూ!" అంది.

ఊc... అని మూలిగాన్నేను. కడుపులో చల్లను కదలనీయకుండా కారు రోడ్డు మీద జరజర పాక్కుంటు పోతున్నది.

"సుశ్మీ! ఈ కారు అమ్మేసి, ఇప్పుడు కొత్తగా ఓ కారు మార్కెట్‌లోకి వస్తుంది – మేబాఖ్ అని పేరు. దాని ఖరీదెంత తెలుసా ఐదు కోట్లు...'' అని చెప్పుకుంటూ పోతున్నది. ఐదు కోట్లు ఖరీదు చేసే కారు అని వినేసరికి నా మెదడు పని చేయటం బందయింది. ఆరేడు లక్షల ఖరీదైన కార్లంటాయి... ఇంతవరకు వున్నాయి. కానీ... కోట్లల్లో కార్లు ఏమిటి ? మన దేశం ఎటు పోతున్నది! నలభైశాతం జనానికి తిండి, వుండటానికి ఇల్లూ ఇవ్వలేని మన దేశంలో అంత ఖరీదు చేసే కార్లు అమ్మటం ఉచితమా?.... అనుకున్నాను.

పూర్వం ఫ్రాన్స్‌లో ఫ్యాషన్లు వేగంగా మారేవట. ఒక డ్రెస్సును కొనుక్కొని ఇంటికి చేరేసరికి ఆ డ్రెస్సు ఫ్యాషన్‌లో వుండేది కాదట! అట్లా ఇప్పుడు కార్లమోడల్స్ మారుతున్నాయి. రోజుకో మార్పుతో నెలకో రకం కార్లు బజార్లోకి వస్తున్నాయి. ఆ లగ్జరీలచేత ఆకర్షింపబడ్డ వాళ్ళు సమాజం గురించి గాని సమాజంలో పెరిగిపోతున్న పేదరికం, నిరుద్యోగం గురించి గాని ఆలోచించే స్థితిలో లేరు. నలుగురితో తమ సంపదను పంచుకొని తృప్తి పడే పరిస్థితి నుంచి దూరమైపోతున్నారు. టెక్నాలజీ మారుతున్నది. దాంతో మనుషులూ యంత్రాల్లా తయారైపోతున్నారు. మానవత్వం నశిస్తున్నది. ఇదంతా వస్తు ప్రపంచం సృష్టించే మాయాజాలం! ఆ మాయాజాలాన్ని వైమరిపించే ఆధ్యాత్మిక గురువులూ బయలుదేరుతున్నారు! ✦

మంచి పని

పి.ఎం.సుందరరావు



ఫిరంగిపురం గ్రామానికి ఆ సంవత్సరం అస్సలు వర్షాల్లేవు. పంటలకు నీరు సంగతి తర్వాత. మొదులు జనానికి తాగటానికి నీళ్లే కరువయ్యాయి. ఏడెనిమిది మైళ్లు నడిచి పక్క గ్రామం నుండి నీళ్లు తెచ్చుకుని వాడుకుంటున్నారు.

నీటి సమస్యను ఎలా ఎదుర్కోవాలా? అని గ్రామపెద్దలు, జనం తర్జన భర్జనలు పడుతున్నారు. ఆ గ్రామం మధ్యలోని బొడ్డురాయికి నీళ్లుపోస్తే వర్షాలు వస్తాయని, కొంతమంది బిందెలతో నీళ్లు పోయటం మొదలు పెట్టారు.

అది చూసి గ్రామ సర్పంచ్ వీరయ్య ఖంగుతిన్నాడు. ఆయనకు దేవుళ్లు, దెయ్యాలు అంటే నమ్మకంలేదు. ఎంతో దూరం నుండి మోసుకొచ్చిన నీళ్లను, రాతిపాలు చేస్తుంటే చాలా బాధపడ్డాడు. ఎంత చెప్పినా వీరి మనసు మారదని అర్థం చేసుకున్నాడు. అలా వర్షం పడేదాకా బొడ్డురాయికి నీళ్లుపోయాలని జనం నిర్ణయించుకున్నారు. అది వీరయ్య చెవిన పడింది.

రెండు రోజుల తర్వాత వీరయ్య ఇంట్లో పనిచేసే రంగమ్మ బొడ్డు రాయి దగ్గరకు వెళ్లి దణ్ణం పెట్టుకుంది. కాసేపటికి పూనకం వచ్చిన దానిలాగా ఊగిపోయింది. అక్కడున్న వారంతా 'శాంతించు తల్లీ... నీకేం కావాలో చెప్ప తల్లీ...' అని కేకలు పెట్టారు.

"నేను అంకమ్మ తల్లిని. ఈ ఊరి చివర చిన్న చెరువులో నా శిలాఫలకం వుంది. దాన్ని గురించి పట్టించుకోకుండా మీరు ఈ బొడ్డురాయికి నీళ్లు పోస్తే లాభంలేదు. ఆ శిలాఫలకం బయటకుతీసి, పూజించండి. అప్పుడు అనుగ్రహించి వర్షాలు కురిపిస్తాను'' అని చెప్పి పడిపోయింది. కొద్దిసేపటి తర్వాత పైకి లేచింది.

అది విన్న గ్రామస్థులందరూ సర్పంచ్ వీరయ్య దగ్గరకెళ్లారు. విషయమంతా వివరంగా చెప్పారు. చెరువులోని శిలాఫలకాన్ని బయటకు తీద్దామన్నారు.

"నాకైతే ఇలాంటి మూఢనమ్మకాల మీద నమ్మకంలేదు. అలాగని మీ విశ్వాసాన్ని కాదనను. పదండి. మీతోపాటు నేను కూడా వస్తాను" అన్నాడు.

ఊళ్లో వాళ్లంతా పలుగు, పారలు చేతబట్టి ఎండిపోయిన చిన్న చెరువు అంతా తవ్వారు. ఎక్కడా శిలాఫలకం కనిపించలేదు. చెరువు చుట్టూ కూడా కొంత భాగం తవ్వారు. ఎక్కడా ఏమీ కనిపించలేదు. చివరకు ఆ ప్రయత్నం మానుకున్నారు.

కొన్నాళ్ల తార్వత వారం రోజులపాటు విడవకుండా వర్షాలు కురిశాయి. చెరువు మొత్తం నీటితో నిండిపోయింది. అందులోని నీరు ఆ సంవత్సరమంతా గ్రామ జనానికి, పంట పొలాలకు కరువు లేకుండా చేసింది. గ్రామస్థులంతా ఎంతో సంతోషించారు.

పనిమనిషి రంగమ్మ చేత పూనకం నాటకం ఆడించింది... చెరువు తవ్వించింది... గ్రామసర్పంచ్ వీరయ్యే. కానీ ఈ విషయాన్ని వారిద్దరూ తమ మనసుల్లోనే వుంచుకొన్నారు.



ఎంతమంది వున్నారు!

హాయ్! ఈవారం మీకోసం ఓ వెరైటీ ఫొటో తీసుకొచ్చాను. పక్కనే వుంది చూశారుగా. అందులో ఎవరు కనిపిస్తున్నారు? ఆ... ఇంకెవరు? ఓ తాత వున్నాడు. ఇంకా ఓ అమ్మాయి వుంది. ఓ కుక్క కూడా వుంది' అంటున్నారు కొందరు చిన్నారులు. కానీ నేస్తాలూ... మీరు బాగా దృష్టి పెట్టి చూడండి. ఆ ఫొటోలో తొమ్మిది ప్రాణులు కనిపిస్తాయి. 'ఏంటీ? తొమ్మిదా?' అని ఆశ్చర్యపోకండి. నిజంగా కనిపిస్తాయి. కావాలంటే జాగ్రత్తగా చూడండి. మీకు ఆరు బొమ్మలు కనిపిస్తే సాధారణ పరిశీలనాశక్తి వున్నట్టు. అదే 7 కనిపిస్తే... మీ పరిశీలన ఫరవాలేదని చెప్పవచ్చు. 8 బొమ్మలు కనిపిస్తే మీరు మంచి పరిశీలకులని అర్థం. ఒకవేళ 9 కనిపిస్తే ... మీది నిశిత దృష్టి అని అర్థం. అప్పుడు మిమ్మల్ని అభినందించాల్సిందే.



మరి ఇప్పుడు చెప్పండి మీకు ఆ ఫొటోలో ఏమేం కనిపించాయి? పోనీ నన్ను చెప్పమంటారా? ఆర్చిలాగా ద్వారం వుందికదా. అది తాతయ్య తల. ఈ తాత ముక్కు వుంది చూశారూ అది మరో తాత చెయ్యి. జాగ్రత్తగా చూస్తే మీకు అర్థమౌతుంది. ఊ... ఆ తర్వాత మొదటితాత చెవ్వు దగ్గర చూడండి. ఓ అమ్మాయి బిడ్డను ఎత్తుకుని కనిపిస్తుంది. ఓకేనా. ఇప్పుడు ఆర్చికి కుడివైపున ఒక అమ్మాయి తల వుంది. ఎడమవైపున ఓ కాకి కనిపించిందికదూ. ఆ... సరిగ్గా ఆ కాకి నిలబడిన స్తంభానికి అటూ ఇటూ ఇద్దరి మొహాలున్నాయి. చివరిగా కింద పడుకుని నిద్రపోతున్న పప్పీ కనిపించే వుంటుంది. ఇప్పుడు లెక్క పెట్టండి? మొత్తం ఎన్ని కనిపించాయి. తొమ్మిది. సరిపోయిందా. మళ్లీ వచ్చేవారం మరో ఆసక్తికరమైన ఫొటో తీసుకొస్తానే.

చిన్నారి చిత్రకారులు



పి.జి.బి.ఎన్.ప్రసాద్ (పెడుగు),
4వ తరగతి, శ్రీసాయిసిద్ధార్థస్కూల్,
అశోక్‌నగర్,
కర్నూలు.



బందు అంబేద్కర్, 8వ తరగతి,
జడ్‌పి హైస్కూల్,
చినకాకాని.

టి.శ్యామలాదేవి,
ఎమ్.ఎన్.ఆర్‌హైస్కూల్,
భ్రమరాంబికానగర్,
బీరంగూడ.

కె.యాకయ్య,
8వ తరగతి,
జడ్‌పిహైస్కూల్,
నర్సింహులపేట,
వరంగల్.

ఎలుక కుందేలు

ఆఫ్రికా ప్రాంతంలో నివసించే ఒక జీవి ఎలుకలాగానూ, కుందేలులాగానూ వుంటుంది. స్ప్రింగ్‌హేర్ అనే ఈ జీవి కంగారూలా గెంతుతుంది. పొడవైన వెనుక కాళ్లు, పొడవైన తోక, అంత పెద్దవి కాని చెవులు వుంటాయి. దుంపలు, ఆకులు తినే స్ప్రింగ్‌హేర్ ఒక్కసారిగా మూడు మీటర్ల దూరం దూకుతుంది. దీని శాస్త్రీయ నామం పిడీటిస్ కాపెన్సిస్.

క్విజ్-96

1. చీకటి ఖండం ఏది?
   ఎ. ఆఫ్రికా బి. ఆసియా
2. నక్షత్రాల గుంపును ఏమంటారు?
   ఎ. అంతరిక్షము బి. గెలాక్సీ
3. మన రాష్ట్ర పక్షి ఏది?
   ఎ.పాలపిట్ట బి.పావురం
4. పూర్తిగా నీటి లోపల వుండే మొక్క ఏది?
   ఎ. వాలిస్‌నేరియా బి. తామర
5. విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేసే భాగం ఏది?
   ఎ. గుండె బి. కన్ను
6. ఆస్ట్రేలియా జాతీయ చిహ్నం ఏది?
   ఎ. కంగారూ బి. సింహం
7. 'గోల్డెన్ త్రెషోల్డ్' రచించినదెవరు?
   ఎ.విజయలక్ష్మిపండిట్ బి. సరోజినీనాయుడు
8. రాజ్యాంగపరంగా రాష్ట్రానికి అధిపతి ఎవరు?
   ఎ. రాష్ట్రపతి
   బి. గవర్నర్
9. గోనె సంచుల తయారీకి దేనిని వాడతారు?
   ఎ.జనుము
   బి.పత్తి
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
    ఎ.జె ఎమ్. లింగ్డో
    బి.టి ఎస్. కృష్ణమూర్తి

క్విజ్ 95 కి జవాబులు

1. ఊపిరితిత్తులు 2. ఢిల్లీ 3. చైనా 4. ఎడ్వర్డ్ జెన్నర్ 5. చైనా 6. నిప్పకోడి 7. చార్లెస్ బాబేజ్ 8. తొడ ఎముక 9. ప్రేమ్‌చంద్ 10. ఎర్రకోట

క్విజ్ 94కు సరైన సమాధానాలు రాసిన వారు :

ఎమ్.చిరంజీవి, టి.సురేష్‌కుమార్,జి.భార్గవి, 10వ తరగతి, పార్వతీపురం, విజయనగరం.**కె.సునీల,** 9వ తరగతి, **కె.అనిల్,** 8వ తరగతి, తెనాలి. **డి.విశ్వభారతి,** 8 వ తరగతి, మల్లిఖార్జునకాలనీ, రాజాం. **ఎల్.రాజు,** 8వ తరగతి, రాజాం. **వి.కనకయ్య,** 6వ తరగతి, అద్దంకి, ప్రకాశం. **జె. వరుణ్‌కుమార్, పి.పద్మ, ఎమ్.కరుణ** 9వ తరగతి, లక్ష్మీనగర్, మెదక్.

కలం స్నేహం

పేరు:తూపిలి చార్వాక,
వయసు : 10 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, ప్రజాశక్తి పేపరు చదవడం, క్రికెట్ ఆడడం.
పూర్తి చిరునామా:టి.చార్వాక, సన్నాఫ్ టి.నాగేశ్వరరావు, ఆర్‌టిసి కండక్టర్, గూడూరు, నెల్లూరు-524101.

పేరు: కె.మహేష్,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : చెస్, క్రికెట్ ఆడడం, పేపర్ చూడడం.
పూర్తి చిరునామా : కె.మహేష్, సన్నాఫ్ కె.కృష్ణయ్య, ఇం.నెం: 9-165, తిలక్‌నగర్, పెంట్లవెల్లి, కొల్లాపూర్, మహబూబ్‌నగర్.

మీకూ 'కలం స్నేహం' చేయాలని వుందా...!

అయితే వెంటనే ఓ కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, హాబీలు, అడ్రస్ రాసి మాకు పోస్టు చేయండి. మీ ఫొటో కూడా అతికించండి. మా చిరునామా: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, ఫ్లాట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

నక్క కథ

పంచతంత్ర కథలు

హిరణ్యకుడు (ఎలుక) చెప్పిన కథ విని మంధరుడు అనే తాబేలుకు నవ్వు వచ్చింది. 'నువ్వు అవసరానికి మించి సంపాదించావు. దాచి పెట్టావు. కానీ ఎవరికీ ఎడం చేత్తో విదిలించలేదు. నీ లోభగుణం మూలంగానే నీ ఆహారం అంతా పరుల పాలైంది. చివరకు నీకు ఏడుపే మిగిలింది. ఈ లోభం వల్ల ప్రాణం పోగొట్టుకున్న నక్క కథ నాకు తెలుసు. చెబుతా విను' అంటూ తాబేలు మొదలెట్టింది.

కళ్యాణ కటకం అనే పట్టణంలో భైరవుడనే వేటగాడున్నాడు. వాడు ఓరోజు విల్లంబులు, ఉచ్చులు భుజానవేసుకుని అడవికి వెళ్లాడు. ఓ చెట్టు చాటున మాటు వేశాడు. కొద్దిసేపటికి అటువైపు ఓ లేడి వచ్చింది. అది బాగా కండపట్టి వుంది. భైరవుడు దాన్ని చూసి బాణం వేశాడు. ఆ లేడి పాపం చనిపోయింది. వెంటనే భైరవుడు దాన్ని భుజాన వేసుకుని బయలుదేరాడు. ఈలోగా అతనికి ఒక అడవిపంది ఎదురైంది.

భైరవుడు వెంటనే లేడిని కిందపడేశాడు. పందిమీద బాణం వేశాడు. బాణందెబ్బ గట్టిగా తగిలిన పంది కోపంతో వేటగాడిని కుమ్మింది. దాంతో వేటగాడు చనిపోయాడు. కాసేపటికి పందికూడా చనిపోయింది. అంతేకాదు వేటగాడికి పందికి మధ్య జరిగిన కుమ్ములాటలో పంది కాళ్ల కిందపడి ఒక పాము చనిపోయింది.

సరిగ్గా అప్పుడు 'దీర్ఘారావం' అనే నక్క అక్కడకు వచ్చింది. చచ్చిపడివున్న లేడిని, వేటగాడిని, పందిని, పాముని చూసింది. మంచి ఆహారం దొరికినందుకు ఎంతో సంతోషించింది.

'నాకు ఈ రోజు మూడు నెలలకు సరిపడే ఆహారం



లభించింది. వేటగాడి మాంసంతో ఒక నెల, పందిమాంసంతో ఒక నెల, లేడిమాంసంతో ఒక నెల గడపవచ్చు. ఈ పాము, వింటి నారి ఒకరోజుకు సరిపోతుంది' అనుకుంటూ నరంతో బిగించివున్న వింటినారిని కొరికింది.

నారి తెగడంతో వింటిబద్ద విపరీతమైన వేగంతో నక్క రొమ్మును తాకింది. ఆ దెబ్బను భరించలేక నక్క విలవిలలాడుతూ తన్నుకుని చనిపోయింది.

ఆ కథ ముగించిన మంధరుడనే తాబేలు 'చూశావా మిత్రమా! ఇతరులకు పెట్టి, తాను తిన్నదే తన సొత్తు. కూడబెట్టిన సంపద చచ్చాక వెంటరాదుకదా' అంది.

శ్రద్ధగా వింటున్న హిరణ్యకుడనే ఎలుకకు తాబేలు ఇంకా ఇలా చెప్పింది... 'రాని దానికోసం ఎదురుచూడడం, పోయినదానికోసం ఏడవడం బుద్ధిమంతులకు తగని పని. బతికివున్నవారికి కష్టం సుఖం రెండూ వస్తాయి. కష్టం వచ్చినప్పడు దు:ఖించడం, సుఖం కలిగినప్పడు పొంగిపోవడం చేయకూడదు. నీకు అన్ని ధర్మాలూ తెలుసు. నాకు లఘుపతనకుడు ఎలా స్నేహితుడో నీవూ అలాంటి మిత్రుడివే. మనం ముగ్గురం ఇక్కడే దొరికినదాంతో తృప్తిగా జీవిద్దాం'.

మంధరుడి మాటలకు హిరణ్యకుడు ఎంతో ఆనందించాడు. 'మంధరా! అమృతం లాంటి మాటలు చెప్పి నా మనసులోని తాపాన్ని చల్లార్చావు. మిత్రలాభం ఎంత గొప్ప సంపదో తెలియపరిచావు. చాలా సంతోషంగా వుంది' అన్నాడు.

ఆరోజు నుంచి ఆ వనంలో హిరణ్యకుడు (ఎలుక), లఘుపతనకుడు (కాకి), మంధరుడు (తాబేలు) స్నేహంగా వుండసాగాయి.

చేతుల్లేని సరస్వతి

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండాకాలం కావడంతో ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. ఉక్కపోత విసిగిస్తోంది. శరీరం చెమటలు కక్కుతోంది. ప్రభుదాస్ స్కూటర్ నెమ్మదిగా పోనిస్తున్నాడు.

తలపై హెల్మెట్ లేకపోవడంతో వేడి నేరుగా తగిలి వేడెక్కిస్తోంది.. స్కూటరు వెనక కూర్చున్న సబిత పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. స్కూటరు నడుపుతున్న తండ్రి వీపును ఆనుకుని కూర్చుంది.

"నాన్నా ! దాహం.... కూల్ డ్రింకు తాగుదాం!" వెనుక నుంచి అభ్యర్థించింది. అతనికీ దాహంగానే ఉంది.

రద్దీగా ఉన్న బెంగుళూరు నగరంలో సందులో ఉన్న చిన్న కొట్టుముందు స్కూటర్‌ను ఆపాడు. సబిత కిందకు దిగకుండానే స్టాండు వేశాడు. ఆరేళ్ల సబిత కూల్ డ్రింక్ కోసం ఆశగా చూస్తోంది.

ప్రభుదాస్ జేబులోంచి రెండు రూపాయలకాసు తీసి చల్లగా ఉన్న రెండు వాటర్ పాకెట్లు తీసుకుని ఒకదానిని నోటితో కన్నం చేసి తాగాడు. రెండవ దానిని పట్టుకొని స్కూటరు వద్దకు వచ్చాడు.

సబిత వాటర్ పాకెట్‌ను నిరాశగా చూసింది. "నాన్నా! కూల్ డ్రింకు లేదా ?" అడిగింది.

ప్రభుదాస్‌కు ఓ క్షణం కూతురుకు ఏ సమాధానం చెప్పాలో అర్థం కాలేదు... "కూల్‌డ్రింకు కొనడానికి డబ్బులు సరిపోవు.... అయినా దాహం తీరాలంటే నీరే మంచివి !" అన్నాడు.

తర్వాత ఆ పాకెట్‌ను సబిత నోటికి అందించాడు. ఓ మూల చిన్నగా కొరికి కన్నం పెట్టిందామె. నోటికి అందించి మొత్తం నీరంతా తాగించాడు. ఆమె సంతృప్తిగా ఆ నీటిని తాగింది. "దాహం తీరింది నాన్నా!" అంది.

"నువ్వు ఇక్కడే ఉండు ! కిరాణా సామాన్లు కట్టించుకుని వస్తాను !" ప్రభుదాస్ కుమార్తెను స్కూటర్ మీద నుంచి దింపకుండానే నడిపించుకుని కిళ్లీ బడ్డీ పక్కన పెట్టాడు. "చూస్తుండండి!" అని వాటర్ పేకెట్ అమ్మిన వ్యక్తికి చెప్పి దూరంగా ఉన్న కిరాణా షాపు వైపు సాగిపోయాడు.

కిళ్లీ కొట్టు వ్యక్తి సబితను మొదటి సారి పరీక్షగా చూశాడు. ఆరేళ్ల పాపాయి అందంగా ముద్దుగా గాలి ఊదిన బంతిలా ఉంది. ఆమె కూడా నవ్వుతూ చూసింది. అప్పుడు గమనించాడు ఆ వ్యక్తి. అమ్మాయికి రెండు చేతులూ లేవని తొడుక్కున్న పువ్వుల గౌను రెండు వైపులా చేతుల గుడ్డ వేలాడుతోంది. మొదటి సారి విపరీతమైన జాలి కలిగింది.

"నీపేరేమిటి పాపా ? "

"సబిత!"

"ఏం చదువుతున్నావు ?"

మొదటి ప్రశ్నకు టక్కున జవాబు చెప్పిన సబిత రెండవ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. చెక్కిళ్ల నుంచి కన్నీళ్లు కారాయి.

ఆ షాపు వ్యక్తి గాబరా పడ్డాడు. "చాక్‌లెట్ కావాలా" మాట మార్చాలని ప్రశ్నించాడు. ఆమె తల అడ్డంగా ఊపింది.

ఇంతలో ప్రభుదాస్ అక్కడికి వచ్చాడు.

కూతుర్ని, షాపువాడిని చూసిన తర్వాత ఏదో జరిగిందని అనిపించింది. అడగకముందే షాపువాడు " ఏమి చదువుతున్నావని మీ అమ్మాయిని అడిగితే ఏడుస్తోంది !" అన్నాడు.

"పాపం చదువుకోవాలని దీనికి ఎంతో సరదా ... కానీ ఏ పాఠశాలలోనూ చేర్చుకోవడం లేదు. అందుకు ఎప్పుడూ బాధ పడుతోంది.

'ఎక్కడా ప్రయత్నించలేదా ?"

"రెండు మూడు స్కూళ్లకు వెళ్లాను. చేతులు లేని అమ్మాయి ఎలా రాస్తుందని ఎవరూ అవకాశం ఇవ్వలేదు. అందుకే ఇంటి దగ్గరే కాళ్లతో అక్షరమాల నేర్చుకొంటోంది" ప్రభుదాస్ వివరించాడు.

కిళ్లీషాపు వ్యక్తి సుందరేశమూర్తికి తండ్రీ కూతుళ్లను చూసిన తర్వాత విపరీతమైన జాలి కలిగింది. స్టాండు వేసిన స్కూటరు మీద ఏ ఆధారం లేకుండా పట్టుకునే అవకాశం లేకుండా కూర్చున్న సబితను చూసి చలించిపోయాడు. ఇంతలో స్కూటర్ స్టార్ట్ చేయబోతున్న ప్రభుదాస్‌ను వారించి "అయిదు నిమిషాలు ఉండగలరా ? మీతో మాట్లాడాలి...." అన్నాడు. గబగబ వచ్చిన కస్టమర్ల అవసరాలు చూసి ప్రభుదాస్ వద్దకి వచ్చాడు.

తర్వాత నెమ్మదిగా " మీ అమ్మాయి ఉత్సాహం చూసి నాకు ముచ్చట వేస్తోంది. మానసిక వికలాంగ పాఠశాలలో మా తమ్ముడు పని చేస్తున్నాడు. అమ్మాయి చదువుకోవడానికి వాడు సహాయం చేస్తాడు. నేను ఫోన్ చేసి చెబుతాను. సబితను తీసుకువెళ్లండి". సుందరేశమూర్తి వివరాలన్నీ చెప్పి చిరునామా రాసిన కాగితం అందజేశాడు.

సుందరేశమూర్తి చేసిన ఆ చిన్న సాయం సబిత జీవితాన్ని కొత్త మలుపు తిప్పుతుందని ఎవరూ ఊహించలేదు.

రెండు చేతులూ లేని సబిత ఒకటవ తరగతిలో విద్యార్థినిగా చేరింది. అందరూ చేతితో పెన్ను పట్టుకుంటే ఆమె కుడి కాలుతో పెన్ను పట్టుకోవడం నేర్చుకొంది.

చిన్న చిన్న పదాలు రాయడం మొదలు పెట్టింది. మొదట కాలుతో రాయడం కష్టం అనిపించింది. అక్షరమాల నేర్చుకోవడంతో కొంత అనుభవం ఉండటం..ఆమెకు ఎంతో ఉపకరించింది.

అందరు విద్యార్థుల కన్నా ఎంతో కష్టపడేది. ఒక కాగితం మీద రాస్తూ పుస్తకం కదిలిపోకుండా మరో కాలితో అదిమి పట్టేది. పేజీలు తిప్పడం కూడా కాలితోనే చేసేది. మొదట్లో కాస్త కష్టం అనిపించినా రానురాను అలవాటు అయిపోయింది. ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు కాలితో రాసే సబితను చూసి ఆశ్చర్యపోయే వారు. ఆమె తెలివి తేటలు, అందంగా రాసే దస్తూరి చూసి ఎంతో మెచ్చుకొనేవారు.

క్రమక్రమంగా తరగతులను దాటి పదవ తరగతిలో ప్రవేశించింది. సబిత పబ్లిక్ పరీక్షలు ఎలా రాయగలదోనని అందరూ భయపడ్డారు.

ఆరోజు ప్రభుదాసు కూతురితో– "అమ్మా! నీ చదువు అందరికీ వింత.. నువ్వు సాధించిన విజయం పై నీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఇంతవరకూ ఎలా పాసయ్యావన్న విషయం ఎవరికీ అవసరం లేదు. ఈ ఏడాది చదువే నీ జీవితంలో కీలకమైనది–" చెప్పాడు.

తండ్రి మాటలను సబిత శ్రద్ధగా ఆలకించింది.

చేతులు లేని తనకు తల్లీతండ్రి తనే అయి పెంచుతున్న తండ్రి ఆవేదన హృదయాంతరాళాలకు తగిలింది. పదేళ్ళుగా కాళ్లతో రాయడానికి తాను చేసిన సాధన గుర్తుకు వచ్చింది. "నాన్నా! నువ్వు గాబరా పడవలసిన పనిలేదు. నీ ఆశయాన్ని, లక్ష్యాలను నేను నెరవేరుస్తాను.. చదవడంలోను, విజయం

సాధించడంలోనూ థ్రిల్లు ఎలాంటిదో నాకు తెలుసు. నువ్వు ఆశించిన విజయాన్ని సాధిస్తాను!" అంది.

కూతురు కళ్లల్లో మెరుపు ప్రభుదాస్ మనసులో ఆనందామృతాన్ని నింపింది.

పదవ తరగతి ఫలితాలు వెలువడ్డాయి.

పేపర్లో నంబరు చూసుకుని సబిత పొంగిపోయింది. ఆమె ఫస్టుక్లాసులో పాసైంది. తన చదువుకు సార్ధకత లభించిందని పొంగిపోయింది. న్యూస్ పేపరును కాలితో తిరగేసి తన నంబరును పదేపదే చూసుకుని మురిసిపోయింది. పెన్ను తీసుకుని పేపరులో నంబరు కింద గీత గీసింది.

నైట్ డ్యూటీ నుంచి తండ్రి ప్రభుదాస్ ఇంకా ఇంటికి రాలేదు. రోజూ ఎనిమిది గంటలకు అతను వస్తాడని తెలుసు. అయినా మనసు ఆగడం లేదు. దగ్గరలో ఉన్న ఎస్.టి.డి. బూత్‌కు పరుగు పరుగున వెళ్లింది. నంబరు చెప్పి అక్కడ పనిచేసే అమ్మాయితో తండ్రిప నిచేసే కంపెనీకి ఫోన్ చేయించింది. అటు నుంచి రిప్లయి రాగానే చెవి వద్ద ఫోన్ పెట్టించి- "నాన్నా! నేను ఫస్టుక్లాసులో పాసయ్యాను.. ఈరోజు పేపర్లో రిజల్ట్సు ప్రకటించారు.." ఆ తర్వాత ఆమె ఏమీ చెప్పలేకపోయింది. నోటిలోంచి మాటలు బోరున ఏడుపు మాదిరి బైటికి వచ్చింది. అలవికాని ఆనందం ఆమె కళ్లను చిలికి కన్నీళ్లను వెలిగక్కాయి.

ఎస్.టి.డి అమ్మాయి ఫోను తీసుకుని క్రెడిల్ మీద పెట్టింది. డబ్బులు తీసుకోమని మెడకు తగిలించిన పర్సును సబిత చూపించింది.. "థేంక్స్ సబితా! బిల్లు వద్దులే.. నువ్వు పాసైనందుకు కంగ్రాట్సు!" అంది ఆమె.

సబిత పరుగు పరుగున ఇంటికి వచ్చింది.

మే నెల

ఎండలు విపరీతంగా కాస్తున్నాయి.

ప్రభుదాస్ స్కూటర్ మీద ఇంటికి వస్తున్నాడు. స్కూటర్ వెనుక సబిత కూర్చుంది. ఆమె మెడలో సంచి ఉంది. ఆ సంచిలో మార్కుల జాబితా ఉంది.

"నాన్నా! నాకు అన్ని మార్కులు వస్తాయని అనుకోలేదు.. టాప్ రేంకర్‌గా గుర్తింపు పొందడం ఎంతో ఆనందంగా ఉంది!" అంది.

"అవునమ్మా! నువ్వు ఫస్టక్లాసులో పాసయ్యావన్న ఆనందం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఇప్పుడు మార్కుల జాబితాలో నీకే ఎక్కువ వచ్చాయి. బహుశా బెంగుళూరులో హైస్కూళ్లన్నింటిలోనూ నువ్వే టాపర్‌వి అయివుంటావు!" అన్నాడు.

సబితకు తండ్రి మాటలు ఉద్వేగాన్ని కలిగించాయి.

"నాన్నా! నువ్వు నన్ను అడుగడుగునా ప్రోత్సహించావు. అనాకారినని అసహ్యించుకోలేదు. అమ్మ లేకపోయినా ఆప్యాయతను పంచావు.." ఆమె మరి చెప్పలేకపోయింది.

"సబితా! ఎండ దంచేస్తోంది. దాహంగా ఉంది. కూల్ డ్రింక్ తాగుదామా?" అని కూతురు జవాబుకు ఎదురు చూడకుండా సందులో స్కూటర్‌ను ఆపి కిళ్లీబడ్డీ వద్దకు వెళ్లాడు.

ఆశ్చర్యం సుందరేశమూర్తి..

రెండు కూల్‌డ్రింకులు తీసుకుని ఒకటి తను తాగి మరొకటి సబితతో తాగించాడు. ఆ తర్వాత ఆమె ప్రతిభ గురించి వివరించి చెప్పాడు. "ఆరోజు ఇచ్చిన సలహా సబితను కీర్తి శిఖరం మీద నిలబెట్టింది. పట్టుదల ఆత్మవిశ్వాసం ఆమెను ఈ స్థాయికి తెచ్చాయి.." ప్రభుదాస్ కృతజ్ఞతలు చెప్పాడు. తర్వాత కూతురు వద్దకు వచ్చి పదేళ్ల క్రితం చదువుకోమని చెప్పిన విషయం గుర్తు చేశాడు.

స్కూటర్ మీద కూర్చున్న సబిత - "థాంక్యూ అంకుల్.. మిమ్మల్ని మరిచిపోలేదు" అంది. కంగ్రాచ్యులేషన్ సబితా.. టాప్ రాంకులో టెన్త్ పాసయ్యావు కదా?" షాపులోంచే అభినందనలు తెలిపాడు.

ప్రభుదాస్ కూల్‌డ్రింక్‌లకు డబ్బులు ఇవ్వబోతుంటే సుందరేశమూర్తి సున్నితంగా తిరస్కరించాడు. "డబ్బులు వద్దు.. ఈ స్వీట్ చాక్‌లెట్ కూడా తినిపించండి!" అంటూ అందించాడు. ✦

వక్రరేఖలు

(9వ పేజీ తరువాయి)

హడావిడిగా వెళుతున్నాడు.

ఆ అబ్బాయి వెనకాలే పుస్తకాలు, కేరియర్, వాటర్ బేగ్‌లాంటి సామాన్లు మోసుకుని పరుగెడుతున్నాడు సూరిగాడు. అయితే బరువువలన చినబాబుతో పాటు వేగంగా పరుగెత్తలేక పోతున్నాడు.

కాన్వెంటు దగ్గరయ్యాక సూరిగాడి దగ్గర ఉన్న సామాన్లు తీసుకున్న చినబాబు వేగంగా కాన్వెంటు లోపలకు వెళ్లబోతుండగా

"బాబుగారూ... ఇదిగోండి... ఈ బాక్సు నా దగ్గర ఉండిపోయింది" అంటూ సూరిగాడు పిలిచాడు.

విసుగ్గా వెనుదిరిగింది చూశాడు ఆ అబ్బాయి.

"వేగంగా తీసుకురారా" అంటూ కోపంగా అరిచాడు.

ఆ బాక్సులో ఆ రోజు వారికి క్రాఫ్టు క్లాసులో ప్రాక్టీసు చేయడం కోసం ఏవేవో పూసలు, చిన్న చిన్న అద్దాల ముక్కలు లాంటివి ఉన్నాయి.

చినబాబు కేకతో అదిరిపడ్డ సూరిగాడు, ఆ బాక్సు అందించాలన్న ఆత్రుతతో పరుగెత్తి వస్తున్న సూరిగాడు ఒక చిన్న రాయి తగులుకుని బోర్లా పడిపడిపోయాడు. వాడి చేతిలో ఉన్న బాక్సు చేతిలోనుండి తుళ్లిపోవడంతో అందులో ఉన్న పూసలు, అద్దాల్లాంటి సామాన్లు చెల్లాచెదురు అయిపోయాయి.

ఆ దృశ్యాన్ని చూసిన చినబాబులో కోపం పెల్లుబికింది.

"ఈడియట్ కాన్వెంటుకు లేటవుతంటే మళ్లీ ఇదొకటా" అంటూ కిందపడ్డ వాడిని చేతిబలం కొద్దీ కొడుతున్నాడు. కాలితో తంతున్నాడు.

"తీస్తాను బాబూ.. తీస్తున్నాను" అంటూ చెల్లా చెదురైన వాటిని దెబ్బలు కాస్తూ ఏరుతున్నాడు. సూరిగాడు.

అయితే ఆ ఇద్దరూ కలిసి చేస్తే ఆ వస్తువులను వేగంగా ఏరవచ్చు. కానీ సూరిగాడితో సమంగా పని చేయడానికి ఆ కాన్వెంటు విద్యార్థి ఒప్పుకోడు. పైగా ఇంకా వేగంగా చేయమని సాటి వయసువాడిని తిడుతున్నాడు, కొడుతున్నాడు. అవి అన్నీ సూరిగాడు మౌనంగా భరిస్తున్నాడు.



పదిహేనేళ్ల సూరిగాడ్ని, పదేళ్ల ఆ అబ్బాయి కొడుతున్నా సహజంగా రావలసిన కోపం వాడికి రావడం లేదు. కోపం వచ్చినా అణుచుకోవాలే తప్ప ఎదిరించకూడదంటూ పేదరికం నేర్పిన 'అసహాయత' వాడినలా తయారు చేస్తే

'పనికి కుదిరిన వాడిని భయపెట్టో, తిట్టో, అవసరమైతే కొట్టో మన పని మనం చేయించుకోవాలి' అనే ధన అహంకారం ఒక విద్యార్థిని సైతం అలా తయారు చేసింది.

వారిద్దరూ అలానే పెరుగుతారు.

ఎప్పటికీ ఆర్థిక సమానత్వం సాధించుకోలేని ఈ సమాజంలో

సాటివాడిని మనిషిగా చూడాలని ధనికుడికి ఉండదు.

అన్యాయాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మస్థయిర్యం పేదవాడికీ ఉండదు.

దేశానికి వెలుగురేఖలుగా భాసించాల్సిన పసివారు ఇలా వక్రరేఖలుగా రూపొందడానికి కారణం కేవలం ఆర్థిక అసమానతలే.

ఆ అబ్బాయి సూరిగాణ్ణి కొడుతున్నాడు, తంతున్నాడు, అలా కొడుతూనే ఉంటాడు. సూరిగాడు వాటిని భరిస్తున్నాడు. భరిస్తూనే ఉంటాడు. ఎవరో మహాకవి అన్నట్లు- ' ఈ దేశపు మట్టిలోన పువ్వులసలే వికసించవు.
మొగ్గలోనే తుంచేసే మొరటుతనం మన స్వాతంత్ర్యం" ✦

కాఫీ తాగండి...

లక్ష్మి

మనం వింటున్న ప్రతి మాటా–
'అక్షర సత్యం' అనుకునేందుకు వీల్లేదు!
కొన్ని అతిశయోక్తులుంటాయి!
కొన్ని అబద్ధాలుంటాయి!

అంతమాత్రాన చెవుల్లో దూదికుక్కుకుని జాగ్రత్త పడమని చెప్పడం లేదు. వినండి. ఎవరు ఏమి చెప్పినా వినండి. ప్రమాదం లేదు!

వినీ వినంగానే రియాక్టు కావద్దు! ఈ విషయం చెప్పడానికే చిన్న ఉదంతం మీకు మనవి చేసుకుంటున్నాను!

ఆవిడ పెద్దావిడ. ఫోన్లో మాటాడుతోంది. వాళ్ళాయన బందరు వెళ్ళేడంది. వాళ్ళబ్బాయి కేంపుకెళ్ళేడంది. ఇంటో తానూ తన కోడలు మాత్రమే వున్నామంది. ఈ వివరాలు చెప్పి ఫోను పెట్టేసింది!

పనిమనిషి–

ఆయాసపడిపోతూ కొంగుతో మొహం తుడుచుకుంటో తనలో తానే మాటాడుకుంటో ఇంటోకొస్తోంది–

"దీని జిమ్మడ! దొంగముండ! నాతో పరుగుపందెం పెట్టుకుని నా పేణాలు తీసింది!"

"ఎవరే?" అని అడిగింది పెద్దావిడ.

"కుక్కముండమ్మ! మా గడుసు కుక్క!"

"కుక్కా?" అన్నది పెద్దావిడ తేలిగ్గా

"అదేంటమ్మా? అంత తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. కుక్క కరుస్తే బొడ్డు సుట్టూతా సూది మందు పొడుస్తారండి! ఆ బాధ పళ్ళేక ఇంటో తొంగో వలసి వస్తుందండి. పని మానేసి ఇంటో కూకుంటే మీరు ఊరుకుంటారా ఏంటండీ? జీతం తెగ్గోస్తారు గదా! జీతం తెగ్గోస్తే ఇల్లెట్టా గడుస్తుందండీ?"

"ఇంతకీ అది ఎవరికుక్కే?"

"బాగుందండి చోద్యం? కుక్కల మీద అడ్రస్సులు కూడా రాస్తారా ఇద్దారంగా! ఈది కుక్క దానికి దొరక్కుండా తప్పించుకొచ్చేసరికి ఇంతాలిస్యమైందండి."

"ఊ! చాల్లే నీ బడాయి కబుర్లు! తోటపనికి రావులమ్మ మూడ్రోజుల్నుంచీ రావడం లేదే! వంటో ఎట్లా వుందో ఏమిటో? ఒక తడవ వాళ్ళింటికి వెళ్ళి కనుక్కో!"

"వద్దులేండమ్మా! నేను కనుక్కోడాలూ... కనుక్కున్నది మీకు చెప్పడాలూ... నేను చెప్పింది మీరు సుబ్బరంగా వినడాలూ... విని మనసు చెడగొట్టుకోడాలూ... వద్దులేండమ్మా... పెద్ద గొడవైపోద్ది!"

'గొడవా? ఎందుకే గొడవ?'' ఆశ్చర్యంగా అడిగింది పెద్దావిడ.

"మరి కాదేంటమ్మా? అత్తాకోడళ్ళ గొడవ చెబితే మీ మనసు పాడవదా?"

"ఎక్కడో ఎవరో అత్తా కోడళ్ళు ఏదో గొడవ పడితే నా మనసెందుకు పాడవుతుందే పిచ్చిదానా?"

"తమరం కూడా ఈ మద్దెనే అత్తగారయ్యేరు గదండీ! అదండి!"

"అసలేం జరిగిందో చెప్పకుండా–"

"ఇంకా ఏం జరగాలమ్మా! అత్తకి తెలవకుండా అన్నంలో సున్నం కలిపి పెట్టిందంట రావులమ్మ!"

"అయ్యోపాపం! అదేం పనే!"

"శాస్త్రమండీ! శాస్త్ర ప్రకారం కోడళ్ళు అట్టాంటి పన్లే చేస్తారు. అయినా ఈ మాత్రం దానికే ఇద్దారపడి పోతున్నారంటే – కాజవారి ఈదిలో తంతు ఇంటె తట్టుకోలేరు!"

"అక్కడేం జరిగిందే?"

"వద్దులేండమ్మా! పాపపు మాటలు నే చెప్పలేను. చెబితే అష్టోత్తరపూజ చేసుకోవాల. దానికో పాతిక ఖర్చవుద్ది! అంతడబ్బు నేనెక్కడ్నించి అట్టుకురానూ?"

"పాతికేకదా? నేనిస్తాలే!"

"కాజవారి ఈదిలో కనకమ్మగారనీ – మీలాంటి అత్తగారేనండమ్మా– ఉత్తమురాలు! కోడల్ని కన్నబిడ్డలాగా – అచ్చం మీలాగానే చూసుకునేది మా తల్లి! ఎంతైనా కోడలు గందా! రూలు ప్రకారం అత్తమీద కోపం తెచ్చుకుని – కాఫీలో విషం కలిపి ఇచ్చిందంట!"

"ఏమిటీ? కాఫీలో విషం కలిపి యిచ్చిందా? ఆ విషం అత్తగారు తాగేసిందా?" ఆత్రంగా... ఆందోళనగా అడిగింది పెద్దావిడ.

"ఎంటనే తాగలేదంటండి! ఇప్పుడెందుకులేమ్మా అందంట! కోడలు పిల్ల ఊరుకుంటదా? ఊహూ! తాక్కపోతే నా మీద ఒట్టే అని గారాలు పోయిందంట! అంతేనండమ్మా! అంతమాటవిని తట్టుకోలేక కనకమ్మగారు కోడలిచ్చిన కాఫీని కళ్ళు మూసుకుని గడగడా తాగేసి యిరుచుకుపడిపోయిందంట పుణ్యాత్మురాలు!"

"అయ్యయ్యో! ఘోరకలి కాకపోతే కాఫీలో విషం కలిపి అత్తగార్ని చంపుకుంటుందా – పాపిష్టి కోడలు"

అని పెద్దావిడ 'పాపిష్టి కోడల్ని' తిట్టిపోస్తుండగా – పనిమనిషి బట్టలుతికే పనిమీద పెరట్లోకి వెళ్ళిపోయింది!

పనిమనిషి చేరవేసిన పాపిష్టికోడలి పాశవిక చర్య ఆ పెద్దావిడ మనసుని కలవరపరిచింది!

నిజానికి ఆ అత్తగారు–

కోడలు పిల్ల తెచ్చిన కాఫీ తాగి కన్ను మూసిందో – సరిగ్గా అప్పుడే తన్నుకొచ్చిన గుండెపోటుతో ప్రాణాలు విడిచిందో ఆ పైవాడికే తెలియాలి!

కోడలిచ్చిన కాఫీతాగి అత్తగారు కన్ను మూసేరు!

అత్తా కోడళ్ళ మధ్య దూరాన్ని పెంచడానికి ఈ వార్తచాలు!

ఆ తర్వాత కథ ఈ ప్రకారం నడుస్తుంది.

"తీసుకోండి అత్తయ్యా"

"ఏమిటమ్మా అది" అని అడుగుతుంది పెద్దావిడ కోడల్ని అనుమానంగా చూస్తూ...

"కాఫీ" అంటుంది కోడలు.

"నేను కాఫీ తాగను కదా!" అంటుంది పెద్దావిడ దిగులుగా

"మీ అబ్బాయిగారు నాకు అన్ని విషయాలు చెప్పేరండి. ఆయన చెప్పినట్టే కాఫీలో షుగర్ కలపకుండా తెచ్చేను!"

"మరేం కలిపేవు?" అడుగుతుంది పెద్దావిడ.

"ఏమీ కలపలేదండీ! ఎందుకిట్లా అడుగుతున్నారు?"

"ఏమీలేదమ్మా! షుగర్ బదులు ఏదైనా కలిపి తెచ్చేవేమోనని – అయినా ఇవాళ శుక్రవారం కదా! నేను కాఫీలవీ తాగను!"

"శుక్రవారం కాఫీ తాగరా? ఈ సంగతి నాకు మీ అబ్బాయి గారు చెప్పలేదే?" ఆశ్చర్యంగా అడుగుతుంది కోడలు.

"ఈ విషయం వాడిక్కూడా తెలీదులే! అంచేత చెప్పి వుండడు! కష్టపడి తీసుకొచ్చినట్లున్నావు! నువ్వు తాగెయ్!"

"అమ్మో! నేనా? నా వల్లకాదు!"

"ఎంచేత?" కుతూహలంగా అడిగింది పెద్దావిడ.

"షుగర్ లేని కాఫీ నేను తాగలేను!"

"అంతేకదా? ఆ షుగరేదో నేను కలుపుతా! ఇట్లాఇవ్వు!"

"వద్దులేండి! నేనే కలుపుకు తాగుతాను!"

అని కప్పుతో సహా వంటగదిలోకి వెళ్ళిపోతుంది!

ఈ వెళ్ళిపోడానికి 'పారిపోయింది' అని పేరెట్టుకుంటుంది పెద్దావిడ. అంచేత – కాజవారి వీధిలో కనకమ్మ చావు మరిచిపోయేంత వరకు – ఈ ఇంటో పెద్దావిడ కోడలు పిల్ల ఇచ్చిన పచ్చిగంగ కూడా ముట్టుకోదు! కాఫీ తాగండి అనే మాట ఎప్పుడు ఎక్కడ ఏ సందర్భంలో వినిపించినా ఉలికి పడుతూనే వుంటుంది! ✦

అబ్బబ్బో... భలే... అంతా బాగుంది

రుక్మిణి

ఆ రోజు యమలోకం నుండి మాంచి దున్నపోతు మీద సవారీయైన యమధర్మరాజుగారు - మీసాలు మెలేసుకుంటూ - చేతిలో గదను బరబర తిప్పుకుంటూ, మధ్యలో చప్పుడు చేయని వికటాట్టహాసాలు చేసుకుంటూ మాంచి మూడ్‌లోనే బయలుదేరినాడు. ఆ బరువును మోయలేక మహిషం ముక్కి మూలుగుచున్నది. చిత్రగుప్తుడు ఎగురుకుంటూ... దగ్గుకుంటూ చిట్టాచేత బట్టుకుని లొడలొడ పేర్లు చదువుతూ ఒకటే గెంతులు!

ఈ మధ్యకాలంలో యముడిగారికి యమభటులపై కోపం పెరిగిపోయింది. వారు పీక్కుని వస్తున్న ప్రాణాలకూ... భూలోకంలో ఆయువు తీరి గుటుక్కుమంటుంటే, ఇక్కడ చిత్రగుప్తుల వారు చిట్టాలో చించుతున్న పేజీల లెక్కకూ తేడాలు రావడం చికాకు కలిగిస్తుంది. 'ఎవడెక్కడ... ఎపుడు అర్థాంతరంగా చస్తున్నాడో' తమకే తెలవకపోవడంతో యముడుగారు యమగుర్రుగా వున్నారు.

"అదుగదుగో భరత ఖండం... అదుగదుగో ఢిల్లీ... ఆహా.. ఓహో..." యమపాశాలు చేతబూనిన మందలు మందలు యమభటులు గంతులు వేశారు. యముడు నొసలు చిట్లించాడు. దున్నపోతు మరో మూలుగు మూలిగింది. అప్పటికి మధ్యాహ్నం కావడంతో యమకింకరులు ఆకలికి ఓసారి ఆర్తనాదాలు చేసి వూరుకున్నారు.

"ప్రభూ... అదే భరత ఖండం... అక్కడ ప్రస్తుతం 'అంతా బాగుంది' బాగా ప్రచారంలో వుంది. ఇటేమో ఆకలి హడావుడి చేస్తోంది. అటు ఇరాకో... ఆఫ్ఘనిస్తానో వెళితే మన ఆకలి తగ్గేది" ఓ కింకరుడు బుర్ర నిమురుకుంటూ అన్నాడు.

"అదేమి? 'అంతా బాగేంటి?' అదెట్లా వుంటుందో చూడవలె! చిత్రగుప్తా - ఈ 'అంతా బాగుందీ'... బాగు... బాగు... మతలబేమిటో వివరించుము" యముడు కుతూహలంగా అడిగాడు.

"ప్రభూ... భారతదేశంలో మరో రెండు మూడు నెలల్లో పార్లమెంటు... ఇటు అసెంబ్లీ ఎన్నికలు... భా.జ.పా. వారు ఆ ఎన్నికల లబ్ధికోసం ఆదరాబాదరాగా పూదరకు తగులుకుని తెచ్చి రుద్దుతున్న నినాదమే ఇది. భూకే-భయే-భ్రష్టాచార్‌లాంటి ఓ నినాదంతో ప్రజలను ఏమార్చి గత ఎన్నికల్లో గద్దెనెక్కారు. ఈసారికి ఈ మంత్రాన్ని పఠిస్తున్నారు. టీవీల్లో పత్రికల్లో 'భారత్ వెలిగిపోతుంది' ఆ వెలుగేమిటో చూడవలె... బాగున్నదేమిటో తేల్చవలె.... పద... పద...."

* * *

చేనుగట్ల మీద ఓ నలుగురు రైతులు నాట్యం చేస్తున్నారు. అది ఏ రకమైన డ్యాన్సో జక్కులోడికి అంతుబట్టక తలగోక్కుని ఇంటిదారి పట్టాడు. అందులో ఒకడు రెండు చేతులతో జుట్టు కసాపిసా లయబద్ధంగా పీక్కుంటున్నాడు. దూరంగా మరొకడు ఒంటిమీద బట్టల్ని సన్నని పీలికలుగా వర్రువర్రున చించుకుంటున్నాడు. మరొకడు లపలప గుండెలు బాదుకుంటూ వింతవింత దరువులు పుట్టిస్తున్నాడు. అయితే కొద్దిసేపాగినాక అది 'డాన్సు'లు కావూ... పాగలీ కాదూ అని తేలిపోయింది.

అందులో ఒకడి పత్తిపంటనిండా పురుగులు చేరి భోంచేస్తుంటే... ఇల్లూ... అరుగూ... బర్రె... బడితె కుదవకేసి పాలోమని నకిలీ పురుగుల మందులు పిచికారీ చేసినా అసలు పురుగులు చావకుండా వెక్కిరింతకు తగులుకోడంతో రైతన్నకు తిక్కరేగి జుత్తు పీక్కుంటున్నాడు.

మరో ఆసామి కరంటు దెబ్బకు తోటలో మోటారు పంతం బట్టి పదేపదే కాలిపోడంతో పూరాగా దివాలా తీశాడు. తడిసి మోపెడైన కరంటు బిల్లులు కట్టవా... చస్తవా అని ఇంటిమీదకు ట్రాన్స్కోవాండ్లు దాడి చేస్తే... భయంకొద్దీ పొలంగట్ల వెంటబడి అట్లా గుండెలు బాదుకుంటున్నాడు.

మరొకడు వరిపంటేసుకుని నీళ్ళకోసం ఆబగా చూస్తున్నాడు. నీళ్ళురావు. నీళ్ళులేవు. ఇంకుడు గుంతల్లో వడి కాళ్ళిరగదీనుకోడవే సరిపోయిందిగానీ... ఒక్క చెరువు... కాలువా... చిన్న ప్రాజెక్టులాంటిది లేదాయె... పొలం పెళపెళ ఎండిపోతుంటే పైబట్టల్ని పరపరా చించుడాయె!

అంతా గందరగోళం- అపుడిక ఒకడు ఒరిజినల్ పురుగుమందు సంపాదించి తాగి, మరోడు చెట్టుకొమ్మకు తాడేసుకుని, ఉరిబెట్టుకుని, మరోడు రైలుకింద తలకాయ నూకి అట్లా ఆ ఊర్లో సగం మంది రైతుల దాకా ప్రాణాలు టప... టప... తీసేసుకుంటున్నారు. వాళ్ళ పెళ్ళాం పిల్లలు పెడబొబ్బలే బొబ్బలు!

* * *

"భళభళీ... బాగుంది... అంతా బాగుంది! పనికానివ్వండిరా!" యముడుగారు ఆర్డరు వేయడంతో యమభటులు తమ పాశాలకు పని కల్పించారు. రైతుల ప్రాణాలు లాగి, లాగి వాళ్ళ జబ్బలు నెప్పులకు తగులుకున్నాయి. కడుపులు నిండిపోతున్నాయి. దున్నపోతు ఆనందంగా సకిలించింది!

"అంతా బాగుంది - అబ్బో! 'భారత్ వెలిగిపోతుంది'-వహ్వా..." యముడు ఆనందంగా వుబ్బి తబ్బిబ్బయ్యాడు. చిత్రగుప్తుడు చిట్టాలో పేజీలు చించిపారేస్తున్నాడు!

* * *

మురికి సందులో వాసనకు ముక్కులూ... మూతులూ బద్దలై పోతున్నాయి. ఎక్కడ ఏ మురికాల్వల పక్కన చూసినా జనం... వాళ్ళను 'జనం' అంటే విడ్డూరంగానే వుంటుంది. ఎముకలు... వేలాడే తోలు తప్ప... వాటిల్లో 'జీవం' అనే పదార్థం తప్ప మరేం లేదు. ఎందుకంటే తిండిలేక అట్లా పట్నాలకు కుప్పలుగా వలసలు వచ్చిన జనం మరి!

"గింతంత గంజిపొయ్యవే!" పనిపోరగాని కీచుగొంతు మళ్ళా వినపడకుండా వాడితల్లి కీసరబాసరగా బూతులు తిట్టింది. 'పనికి ఆహారం-బియ్యం పథకం' అంటే అవన్నీ ఎక్కడికి చేరుకున్నాయో ఎవడికీ తెలవదు. ఆకలే తెలుసు! పని లేదు. పస్తులున్నాయి. పాటలేదు -కొనూపిరుంది. ప్రాణాలు పీక్కుపోతున్నాయి. శోషొచ్చి పడిపోతున్నారు. అరిచే ఓపిక కూడా లేక ప్రాణాలు గుటుక్కుమంటున్నాయి...

* * *

"ఓహో... ఆకలి చావులు... భేష్! 'అంతాబాగుంది'... చాలా బాగుంది... భారత్ వెలిగిపోతుంది.... నీ యవ్వ... కానియ్యండిరా"! యముడు భటులకు హుషారు చేశాడు. పాలోమని ప్రాణాలు తోడేస్తుంటే వాళ్ళ జబ్బలు నలిగిపోతున్నాయి. యమకింకరులు వెర్రి ఆనందంతో చేతులనిండా పనితో వుబ్బితబ్బిబ్బులవుతున్నారు. ఈ ఎన్డీయే పాలనలో తమ పని మాత్రం 'చాలా బావుంది'... వెలిగిపోతుంది... ఆహా...!

* * *

"అరె... వాడ్ని పొడువ్... చంపూ... కంఠంలోకి శూలం గుచ్చరా... కానీ" ఒకవైపు కాషాయ మూకలు స్వైర విహారం చేస్తున్నాయి... గ్యాసుబాంబులు పేలిపోతున్నాయి. ఆర్తనాదాలు... ఇండ్లు కాలిపోతున్నాయి... ఏడుపులు... రక్తం... కత్తులు మెరిసి కుత్తుకలు కస్సున తెగి నేలరాలిపోతున్నాయి.

"ఆహా చిత్రగుప్తా... భారత్ మతోన్మాదంలో వెలిగిపోతోంది! ఎంత గొప్ప భావన... జనాలకు ఎంతమంచి బోధన... అంతా బాగుంది... మన పని మాత్రం చాలా బాగుంది.

యముడు మహిషం మీద వుబ్బితబ్బిబ్బవుతూ కూనిరాగానికి తగులుకున్నాడు. చిత్రగుప్తుడు కేరింతలు కొడుతున్నాడు. దున్నపోతు మాత్రం తన్మయంగా కండ్లు సగం మూసుకుని, ఒక సుదీర్ఘమైన కవితకు తగులుకుని నెమ్మదిగా వినిపించసాగింది. ✦



ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన ఇంటర్‌వెన్షనిస్ట్ కార్డియాలజీ నిపుణుల్లో డాక్టర్ ఫయాజ్ షాల్ ఒకరు. ఆయన గుండె, ధమనుల వ్యాధులను ఓపెన్ హార్ట్ శస్త్ర చికిత్సతో పనిలేకుండానే నయం చేస్తున్నారు. గజ్జలలో నుంచి సూక్ష్మకేశనాళికను చొప్పించడం ద్వారా ఆయన వైద్యం చేస్తారు. బహుశా ప్రపంచంలోనే ఏ ఇతర ఫిజీషియన్ చేయని విధంగా ఆయన ఈ పద్ధతిలో **15000** మందికి వైద్యం చేశారు. ఆయన టకోమా పార్క్, ఎండి లోని వాషింగ్టన్ అడ్వెంటిస్ట్ ఆసుపత్రిలో ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజీ డైరెక్టర్‌గా ఉన్నారు. మెడ ధమనుల్లో ఏర్పడే అడ్డంకులను తొలగించడం ద్వారా గుండె పోటును నివారించడంలో తోడ్పడే అత్యంత క్లిష్టమైన ప్రక్రియ కెరోటిడ్ స్టెంట్స్ దార్శనికుడు ఆయన. తీవ్రమైన గుండె జబ్బులకు గురైన రోగుల గుండె గోడలకు చిన్నచిన్న రంధ్రాలు చేయడం వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయి అనే అంశంపై ఆయన ఇటీవల కాలంలో పరిశోధనలు జరుపుతున్నారు. ఈ సన్నని రంధ్రాలలో స్టెమ్ కణాలు లేదా మూలుగ కణాలను చొప్పించడం ద్వారా గుండె కండరాలు, ధమనులు కొత్తగా ఏర్పడతాయా అనే అంశంపై ఆయన ప్రస్తుతం పరిశోధనలు జరుపుతున్నారు. ఆయన **1951**లో కాశ్మీర్‌లో జన్మించారు. **1977**లో షాల్ అమెరికాకు వెళ్ళారు. అక్కడే ఆయన తన పరిశోధనలను కొనసాగిస్తున్నారు. ఆయనను ఇన్‌సైట్ జరిపిన ఇంటర్వ్యూలోని కొన్ని విశేషాలను ఇక్కడ అందిస్తున్నాము.

బైపాస్ సర్జరీ లేకుండానే గుండె జబ్బుల నివారణ

? **మీరు 1988లో "పెర్క్యుటేనియస్ కార్డియో పల్మనరీ సపోర్ట్" అనే ఈ ప్రక్రియను మీరు ఆవిష్కరించారు. అప్పటి నుంచి అనేక జీవితాలను మీరు కాపాడారు. అసలు ఆ పద్ధతి అంటే ఏమిటి?**

✍ ప్రధానంగా ఇది ఆపరేషన్‌కు అవకాశంలేని రోగుల కోసం ఉపయోగపడే ప్రక్రియ. వారు ఎంత సున్నితంగా ఉంటారంటే మనం వారి గుండెను అసలు ముట్టుకోలేము. వారికి శస్త్రచికిత్స కూడా చేయలేము. అందువల్ల నేను గజ్జల ద్వారా ఈ ప్రక్రియలో వైద్యం చేస్తాను. కొన్ని సందర్భాలలో సర్జన్ రోగి ఛాతీని తెరిచి సూక్ష్మనాళికను ప్రవేశ పెడతాడు. హార్ట్ - లంగ్ మెషీన్ రక్తాన్ని తీసుకుపోతుంది. అందువల్ల గుండె విశ్రాంతిలో ఉంటుంది. అప్పుడు వైద్యుడు శస్త్రచికిత్స చేస్తాడు. గుండెను ఆపేందుకే సర్జన్ ఛాతీని తెరుస్తాడు. నేను ఇదే చికిత్సను గజ్జల ద్వారా నిర్వహిస్తాను. ఛాతీ ద్వారా కాకుండా గజ్జల ద్వారా చికిత్సను నిర్వహించడం వల్ల లోకల్ ఎనస్థీషియా ఇస్తే సరిపోతుంది. ఆపరేషన్ చేస్తూనే ఉంటాము. రోగి మనతో మాట్లాడుతూనే ఉంటాడు. ఈ పద్ధతిలో రోగి రెండు రోజుల్లోనే ఇంటికి వెళ్ళిపోవచ్చు.

నేను ఈ పరిజ్ఞానాన్ని 1988లో కనుగొన్నాను. గుండె నిపుణులం 1988-2000 కాలంలో 23,000 ఆపరేషన్లు నిర్వహించాము. ఈ కేసులో 39 గుండె ఆగిపోయిన కేసులు. ఆ 39 మందిలో 31 మందిని మేము కాపాడగలిగాము. అందువల్ల ప్రపంచ నలుమూలల నుంచి చాలా మంది నాదగ్గరకు వస్తున్నారు.

? **షాల్ టెక్నిక్‌గా ఖ్యాతి గాంచిన ఈ పద్ధతిలో డాక్టర్లు శస్త్రచికిత్స అవసరం లేకుండానే వైద్యం చేస్తున్నారు. దీనిని 'ఒన్ స్టాప్ షాపింగ్'గా మీరు కూడా అభివర్ణించారు గదా!**

✍ నేను గుండె ధమనులు, కాలి ధమనులు, మూత్రపిండాల ధమనులు, మెదడు ధమనులను చేయగలను. ఈ అన్ని ప్రదేశాలలోనూ ధమనులు మూసుకుపోయే అవకాశం ఉంది. శస్త్రచికిత్సతో అవసరం లేకుండా నేను శరీరంలోని ఏ భాగాన్నైనా తెరవగలను. ఈ విధంగా చేయగలిగిన వాళ్ళు ఎందరో ఉన్నారు. కానీ దానిని కనిపెట్టింది మాత్రం నేనే.

? **జబ్బులను నివారించే విషయంలో మీరు ఎంతో కృషి చేశారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, గుండె, ధమనులు సక్రమంగా పని**

చేసేలా చేసుకొనేందుకు మనం నిత్యం ఏమి చేయాలి?

✍ మానవ శరీరం కారు వంటిది. మీ కారును మీరు సక్రమంగా చూసుకోకపోతే అది ఎప్పుడైనా ఆగిపోవచ్చు. మీరు పురుషులైతే 40 దాటగానే, స్త్రీలైతే మెనోపాజ్ రాగానే ఎప్పటికప్పుడు చెకప్‌లు చేయించుకుంటూ ఉండాలి. అంతే గాక ఐదు అత్యధిక ప్రమాదకరమైన అంశాలున్నాయి. వీటిలో మీకు ఏ ఒక్కటి ఉన్నా మీరు ప్రతి సంవత్సరం తప్పని సరిగా చెకప్ చేయించుకోవాలి. ఆ ఐదు ప్రమాదాలేమంటే పొగ తాగడం, అత్యధిక రక్త పోటు, సైలెన్స్ కిల్లర్ అయిన మధుమేహం, చెడు కొలెస్టరాల్, చివరగా కుటుంబ వైద్య చరిత్ర. ఏమి జరుగుతున్నదో ముందే తెలుసుకుంటే ఎలాంటి శస్త్ర చికిత్స, యాంజియోప్లాస్టీ లేకుండానే వైద్యం చేయవచ్చును. గుండె జబ్బులను నివారించాలంటే తప్పని సరిగా వ్యాయామం చేయాలి. వ్యాయామం తప్పని సరి. వారానికి కనీసం మూడు రోజుల చొప్పున రోజుకు 30 నుంచి 40 నిముషాల పాటు బ్రిస్క్ వాకింగ్ చేయాలి. మీరు చాలా సాధారణమైన, కొవ్వులేని పదార్థాలను తీసుకోవాలి. రోజుకు 20 గ్రాములకు మించి కొవ్వు తినకూడదనేది నా సలహా. నా వయస్సు ఇప్పుడు 51 సంవత్సరాలు. అయినా నేను టీనేజర్‌లా ఉన్నాను చూడండి. నేను ఎన్నడూ అలసట చెందను. మూడవది మంచినీరు తాగడం. రోజుకు 14 గ్లాసుల నీళ్ళు తాగాలి. మీ మెటబాలిజమ్‌కు, శక్తికి నీరు చాలా అవసరం. దీని వల్ల మీ శరీరంలో అతి తక్కువగా ముడుతలు పడతాయి. మూత్రపిండాలు పనిచేయకుండా పోతే దానికి అనేక మందులున్నాయి. గుండెపోటును నివారించే మందులున్నాయి. మధుమేహం నియంత్రణకు మందులు న్నాయి. అయితే ముందుగా డయాగ్నైజ్ చేయడమనేది ముఖ్యం.

? మీరు కాశ్మీర్‌లో మెడికల్ డిగ్రీ పూర్తిచేసిన తరువాత మారుమూల గ్రామంలో పని చేశారట గదా! దానిని గురించి చెబుతారా?

✍ చెబుతాను. నేను కాశ్మీర్‌లోని చాలా మారుమూల ప్రాంతంలో వాలంటరీ పని చేశాను. అప్పుడు నాకు 21 సంవత్సరాలు. అక్కడ ఉన్న ఏకైక డాక్టర్‌ను నేనే. నేనుగాక ఒక నర్స్, ఒక అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు.

? మీ వాలంటరీ పని పూర్తయిన అనంతరం కొంతకాలం ఇంగ్లండ్‌లో ఉన్నారా?

✍ అవును. అక్కడ కొంత కాలం పని చేశాను. అక్కడ నేను ఉన్నత విద్య కోసం ఉన్నాను. 1977 వరకూ నేను అక్కడ ఉన్నాను.

? గుండె జబ్బులకు సంబంధించినంత వరకూ ముందుగా నివారణే ముఖ్యమని మీరంటున్నారు. దీనికోసం ఎవరైనా ఏమి చేయాలి?

✍ ఒత్తిడికి దూరంగా ఉండాలి. బాగా నిద్రపోవాలి. మీరు నిద్రకు ఉపక్రమించే



టప్పుడు రేపటి గురించి ఆలోచించకండి. రేపటి గురించి భయపడకండి. నిన్నటి నుంచి నేర్చుకోండి. అత్యంత ముఖ్యమైనదేమంటే మరచిపోవడం, మన్నించడం. నువ్వు తప్పుచేసిన వారిని క్షమించలేకపోతే అది జీవితాంతం మిమ్మల్ని బాధపెడుతుంది. మీరు ఇతరులను మార్చలేక పోవచ్చు కానీ మిమ్మల్ని మీరు మార్చుకోగలరుగదా! మరో విషయాన్ని గూడా గుర్తుంచుకోండి. మీరు ఇతరులకు ఇస్తే, ఇతరుల నుంచి రెట్టింపు పొందగలుగుతారు.

? కాఫీ తాగడాన్ని గురించి మీరేమంటారు? దానిని పూర్తిగా మానేయాలని కొందరు అంటుంటారు.

✍ ఒకటి లేదా రెండు కప్పుల కాఫీ వరకూ ఎలాంటి ప్రమాదం లేదు. ఏదైనా అతిగా తీసుకుంటేనే ప్రమాదం.

? కెరోటిక్ స్టెంటింగ్ అనేది చాలా క్లిష్టమైన ప్రక్రియ అని మీరు హెచ్చరిస్తుంటారు. దానిని నిపుణులు మాత్రమే చేయాలంటారు. ఎందువల్ల?

✍ మానవ శరీర శాస్త్రాన్ని క్షుణ్ణంగా తెలుసుకోనిదే హృద్రోగ నిపుణులు కెరటాయిడ్స్‌పై పని చేయజాలరు.

? గుండెకు రంధ్రాలు చేసే నూతన ప్రక్రియను మీరు కనుగొన్నారని పత్రికల్లో వస్తోంది. దీనిని గురించి చెబుతారా?

✍ కొందరు రోగులు ఆపరేషన్ చేయ వీలులేకుండా ఉంటారు. వారి ధమనులు చాలా చిన్నగా ఉంటాయి. వాటిని అసలు తెరవడానికి ఏమాత్రం అవకాశం ఉండదు. వారికి మనం ఓపెన్ హార్ట్ సర్జరీ కూడా చేయజాలం. మొసళ్ళకు గుండెలో చిన్న చిన్న రంధ్రాలుంటాయని, అవి వాటికి చాలా ఉపయోగంగా ఉంటాయని చదివాను. దానిని మేము ప్రయోగిస్తున్నాము. దీని వల్ల కదలికల్లో తేడాలు వస్తాయని ప్రాథమికంగా కనుగొన్నాము. దీని స్థానంలో నేను మరో ప్రక్రియ కనుగొన్నాను. ఈ రంధ్రాలను గుండెకు గాక గుండె గోడలకు చేస్తున్నాము. ఆ రంధ్రాలలో కాలి నుంచి తీసే స్టెమ్ సెల్స్‌ను ప్రవేశ పెడుతున్నాము. అలా చేయడం వల్ల ఆ చిన్న రంధ్రం గుండె కండరంలో నూతన కణాల పెరుగుదలకు సహాయ పడుతోంది.

? అంటే కొత్త కణాల ఉత్పత్తి ద్వారా గుండెకు నూతన జవసత్వాలు వస్తాయా?

✍ మేము దాని ద్వారా చాలా ఆసక్తికరమైన అంశాలను కనుగొన్నాము. నా స్నేహితుడు దీనిని గురించి చెప్పాడు. మూలుగలో కొన్ని ప్రత్యేకమైన కణాలున్నాయని, వాటిని గుండె కండరాలలో ప్రవేశ పెడితే కొత్త ధమనులు, కణాలు ఏర్పడతాయని చెప్పాడు.

? మీరు ఈ మూలుగలోని కణాలను తీసి గుండెలో ప్రవేశపెట్టారా?

✍ అవును. అలా చేసిన తొలి వ్యక్తిని నేనే. మీకు ఒకసారి గుండెపోటు వచ్చిందంటే ఆ కండరం నిర్జీవమవుతుంది. కాబట్టి మేము ఈ మూలుగ కణాలను ఇంజక్షన్ ద్వారా ఎక్కిస్తే అక్కడ కొత్త కణాలు పెరుగుతాయి. నేను చేపట్టిన అత్యంత ఆసక్తికరమైన పరిశోధన ఇదే. ✦

పుస్తక పరిచయం

సినిమా రచనకు పరుచూరి భాష్యం

ఒక రంగంలో పది పదిహేనేళ్లు పని చేసిన తర్వాత చాలా మందిలో ఒక విధమైన యాంత్రికత వచ్చేస్తుంటుంది. కొద్ది మంది మాత్రమే ఆ స్థితిని అధిగమించి నిత్య నూతనంగా వుండిపోతుంటారు. అంటే ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ, వాస్తవాలకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటూ వుండటమే. అలా గత పాతికేళ్లుగా నిలిచిన అగ్రశ్రేణి తెలుగు సినీ జీవులలో పరుచూరి సోదరులు ముఖ్యులు. చలిచీమలు వంటి ఆఫ్ బీట్‌తో మొదలై లక్ష్మీనరసింహా వరకూ సాగిన వారి సినీ జీవితంలో అత్యధిక భాగం విజయాలున్నాయి. ఇంత సినీ జీవితంవున్నందునే పరుచూరి గోపాలకృష్ణ పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం ప్రత్యేకత సంతరించుకుంది. ప్రత్యేకించి ఈ పుస్తకంలోని మూడు, నాలుగు అధ్యాయాలు సినిమాల పట్ల ఆసక్తివున్న ప్రతివారికీ పఠనీయాలు.

నాలుగు వందల పేజీలున్న ఈ పుస్తకం తెలుగు సినిమా తీరుతెన్నులను పట్టి చూపిస్తుంది. సాధారణ రచనకు, సినిమా రచనకు మధ్య వున్న తేడాను గోపాలకృష్ణ ఒక్క వాక్యంలో చెప్తారు- మామూలు కథ చదువుతారు, సినిమా కథ చూస్తారు అని. ఇది స్థూలమైన తేడా. చూసేవాళ్లు లక్షల సంఖ్యలో వుంటారు గనక వారిలో వివిధ స్థాయీ భేదాలుంటాయి గనక అత్యధిక జనం చూస్తేనే సినిమాకు సొమ్ములొస్తాయనే వ్యాపారపరమైన సూత్రాన్ని కూడా జోడిస్తే ఈ తేడా సంపూర్ణమవుతుంది. కమర్షియల్ సినిమా అన్నా, సాధారణ పరిభాషలో మాస్ సినిమా అన్నా దీన్ని దృష్టిలో పెట్టుకుని సినిమా రచన చేసే పరుచూరి పరిశోధనలోనూ ఆ వరవడి పాటించారు. జనబాహుళ్యం అందుకునేలా ఆనందించేందుకు కథా రచన, సంభాషణలు, పాత్ర చిత్రణ ఎలా వుండాలనేదానిపైనే ఆయన కేంద్రీకరణ అంతా.

సినిమా ఆవిర్భావ వికాసాలకు సంబంధించిన మొదటి అధ్యాయంలో వివిధ నిర్వచనాలు, చరిత్ర విశేషాలు ఇచ్చారు. ఆయా దశల్లో సినిమాల పట్ల తమ అభిప్రాయాలు, అంచనాలు ఇచ్చారు. సినిమాలు చూసి చెడిపోతారనే వాదనను ఖండించారు. ఈ అధ్యాయంలో పరుచూరి వాదనలు కూడా ఆయన సినిమా

తెలుగు సినిమా సాహిత్యం
కథ-కథనం-శిల్పం
రచన: డా. పరుచూరి గోపాలకృష్ణ,
వెల: రూ. 200, **ప్రచురణ:** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

డైలాగులలాగే వుండటం విశేషం. రెండవ అధ్యాయంలో సినిమా కథల వర్గీకరణ, వాటిలో జనరంజకమైన అంశాల విశ్లేషణ వున్నాయి. తమ రచనలో వెలువడి చిరంజీవిని మెగాస్టార్‌ను చేసిన ఖైదీ చిత్రాన్ని ఎక్కువగా దృష్టిలో పెట్టుకుని రచనలో మెళకువలను తెలియజేశారు. సినిమా విజయంలో రచయిత పాత్ర, తారల ఇమేజి తదితర అంశాలను చర్చించారు. 'విజయానికి మూలం కథ, దాని రేంజికి కొలబద్ద ఇమేజి' అని ఎన్టీఆర్‌ను ఉటంకిస్తూ చెప్పారు. తెలుగు సినిమాలలో చూపించిన వివిధ సమస్యలను, వాదనలను, ఉద్యమాలను సవివరంగానే పేర్కొన్నారు. ఈ అధ్యాయంలో కూడా దృష్టి మాత్రం మాస్ సినిమాదే.

కథనం శిల్పాలపై మూడు, నాలుగు అధ్యాయాలలో గోపాలకృష్ణ విజయవంతమైన కళాత్మక చిత్రాలను ఉదాహరణగా తీసుకుని వాటి కథ, మలుపులు, పాత్రలు, సంభాషణలు, సంఘటనలు వగైరాలు ఎలా రూపుదిద్దుకున్నదీ చక్కగా చెప్పారు. సినిమారచన గురించి తెలుసుకోగోరేవారికి ఇదెంతో ఉపయోగకరం. తెరపై సినిమాచూసి ఆనందించే సగటు ప్రేక్షకుడు గమనించని శిల్పపరమైన అంశాలు ఇందులో చర్చించారు. వాణిజ్యపరంగానైనా సినిమాకథను ఎన్ని కోణాల నుంచి చర్చించి తయారు చేస్తారో ఈ అధ్యాయాలు చెబుతాయి. బిఎన్‌రెడ్డి అపూర్వ సృష్టి మల్లీశ్వరిని ప్రధాన ఉదాహరణగా తీసుకుని చెప్పడం అత్యంత సముచితంగా వుంది. అలాగే పాతాళభైరవి, రోజులు మారాయి, శంకరాభరణం, మాయాబజార్, ముత్యాలముగ్గు, శుభలగ్నం, ఖైదీ, అసెంబ్లీ రౌడీ, సమరసింహారెడ్డి, గణేష్, బొబ్బిలిపులి వగైరా అనేక విజయవంతమైన సినిమాల కథలను విశ్లేషిస్తూ వాటి లోతుపాతులు తెలియజేశారు. అవసరమైన చోట రచయితలు లేదా దర్శకుల వివరణలు పొందుపరచారు. అన్ని రకాల కథలు రాసిన లివింగ్ లెజండ్ త్రిపురనేని మహారథి అని ఒక సందర్భంలో ప్రశంసించారు.

సినిమాలలో వాణిజ్య పరమైన అంశాల అవసరాన్ని ఎంతగా నొక్కిచెప్పినా అసహజత తప్పని సరి అని చెప్పడం వాదనకు నిలవదు. చారిత్రిక దృష్టితో చెప్పడంలోనూ, వర్గీకరణల్లోనూ కూడా మరింత సంయమనం, సమతుల్యత వుండాల్సింది. సత్యజిత్‌రే వంటి భారతీయ మహామహుల శైలిని గురించి రేఖామాత్రంగానైనా చర్చిస్తే బావుండేది. సామాజిక ఆర్థిక నేపథ్యంలో సినిమాను ఎలా అర్థం చేసుకోవాలనే దానిపై కూడా స్పష్టత వుండాలి. అలాగే సినిమాలో కీలక సన్నివేశాల స్టిల్స్‌ను పొందుపరచితే మరింతగా అర్థం చేసుకునే అవకాశం, ఆకర్షణ కూడా వుండేవి.

ఇలాటి కొన్ని పరిమితులున్నా సినిమా రచనను అర్థం చేసుకోవడానికి ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది. పుస్తకం చివరలో 1931 నుంచి ఇప్పటి వరకూ వచ్చిన తెలుగు సినిమాల జాబితాను పొందుపరచడం వల్ల రెఫరెన్సు విలువ పెరిగింది. అలాగే ఖైదీ సినిమాకోసం తాము రాసుకున్న ఏకవాక్య దృశ్యమాలిక నివ్వడం కూడా యువరచయితలకు చాలా ఉపయుక్తం. డాక్టర్‌ను కాబోయి యాక్టర్‌నయ్యాను అనేది ఊతపదంగా వాడే సినిమా రంగంలో ఇంత రికార్డు తర్వాత డాక్టరేట్ చేయబూనుకున్న పరుచూరి పట్టుదల, పరిశ్రమ అభినందనీయమైనవి.

- తెలకపల్లి రవి

స్వీకారం



ఉద్యోగులపై వేటుకు బాబు-బ్యాంకు రహస్య నివేదిక
ముందస్తు గురి - ముగిశాక ఉరి
రచన : ఎస్. వీరయ్య,
వెల: రూ. 1/-, **ప్రతులకు:** ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



ఆరుద్ర సినీ గీతాలు
సంకలనం : కె. రామలక్ష్మి,
వెల: రూ. 75, **ప్రచురణ:** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



మందారదామం
రచన : మండగొండి నరేష్
వెల: రూ. 150/-, **ప్రచురణ:** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

టూరిస్ట్‌గైడ్

శిల్పకళా కాణాచి లేపాక్షి

రాకెట్ల వీరన్న



లేపాక్షిలోని ఏకశిలా నాగలింగం

అనంతపురం జిల్లా అనగానే కరువు ఇట్టే గుర్తొస్తుంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్ తర్వాత భారతదేశంలో అత్యల్ప వర్షపాతం గల రెండో జిల్లాగా పేరు గాంచింది. కరువుకు ఎంత ప్రసిద్ధో ఈ జిల్లా పర్యాటక ప్రదేశాలకు కూడా అంతే ప్రసిద్ధి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎన్నో పర్యాటక స్థలాలు ఇక్కడ ఉన్నాయి. ప్రపంచంలోనే పేరెన్నికగన్న తిమ్మమ్మ మఱ్ఱిమాను, ప్రపంచప్రసిద్ధి గాంచిన లేపాక్షి శిల్పకళా ఆలయం, ఏకశిలానంది, ప్రపంచదేశాల పర్యాటకుల్ని ఒక చోట కలిపే ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రం పుట్టపర్తి, జైనుల చరిత్రాధారాలను తెలిపే జంబూద్వీపచక్రం, పెనుకొండ, రాయదుర్గం, రత్నగిరి, గుత్తి దుర్గాలు, ఆలూరుకోన, పెన్నఅహోబిళం, కదిరి, కసాపురం, హేమావతి, తాడిపత్రి లోని ప్రఖ్యాతి గాంచిన దేవాలయాలు ఇలా ఎన్నో యాత్రాస్థలాలకు స్వాగతం పలుకుతోంది అనంతపురం జిల్లా.



లేపాక్షిలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఏకశిలా నంది



గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకెక్కిన తిమ్మమ్మ మఱ్ఱిమాను

లేపాక్షి :

'లేపాక్షి' గ్రామంలోని వీరభద్రాలయం భారతీయ శిల్పకళా నైపుణ్యానికి, చిత్రకళలకు ఒక భాండాగారం అని చెప్పొచ్చు. దేవాలయంలోని రంగురంగుల చిత్రాలు, శిల్పాలు యాత్రికుల మనసును ఇట్టే ఆకర్షిస్తాయి. ఇది భారతావనిలో ఉన్న 108 శైవక్షేత్రాలలో ఒకటని, స్కంధపురాణం పేర్కొంటోంది. లేపాక్షి గ్రామం అనంతపురం నుండి 120 కిలోమీటర్ల దూరంలో, హిందూపురానికి 14 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుండి బస్సు సౌకర్యం ఉంది. విజయనగర సామ్రాజ్యంలో పెనుకొండ దుర్గంలో కోశాధికారిగా పనిచేసిన విరూపణ్ణ లేపాక్షి గ్రామంలో వీరభద్ర ఆలయాన్ని చక్కని శిల్పకళా సంపదతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా నిర్మించాడు. అయితే అనూహ్య కారణాల వల్ల అక్కడ కళ్యాణ మండపం ఆగిపోయింది. ఇక్కడున్న 'అంతరిక్ష స్తంభం' భూమి మీద ఏ ఆధారమూ లేకుండా పై కప్పును మాత్రమే ఆధారం చేసుకుని ఉంటుంది. యాత్రీకులను విశేషంగా ఆకర్షించే ఈ అంతరిక్ష స్తంభం ఏ వాస్తు శాస్త్ర పరిశోధకునికీ అంతుపట్టని మహత్తర కళా సృష్టిగా నేటికీ నిలిచింది. దేవాలయ పైకప్పు మీద చిత్రించిన భారత-రామాయణ కథా చిత్రాలు తప్పక చూడవలసినవి. సుమారు 400 సంవత్సరాల పూర్వం చిత్రించిన ఈ చిత్రలేఖనాలు చెక్కు చెదరకుండా ఉన్నాయి. దేశంలోని ఎత్తయిన ఆరు మీటర్ల ఎత్తు, తొమ్మిది మీటర్ల పొడవుతో ఉన్న ఏకశిలా నంది. నందీశ్వరుని చెవులు రిక్కరించి మెడలో గంటలతో లేచి వస్తుందేమో అన్నట్లుగా ఉంటుంది.

గుత్తి :

గుత్తి పట్టణానికి తూర్పున ఉన్న కొండలపైన సముద్ర మట్టానికి ఆరువందల నలభై మీటర్ల ఎత్తున గుత్తి కోట విజయనగర రాజులచే నిర్మించబడింది. ఎందరో రాజుల పాలనలు చూసిన చారిత్రక దుర్గమిది. మూడువైపులా గల గుట్టలను కలుపుకొని కట్టబడిన ఈ దుర్గం బలిష్టమైన రాతి ప్రాకార కుడ్యాలతో లెక్కకు మించిన వృత్తాకారపు కోట బురుజులతో దుర్భేద్యంగా నిర్మితమైంది.

తాడిపత్రి :

తాడిపత్రిలోని చింతల వెంకటరమణ స్వామి ఆలయం ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం. పూర్వం ఈ ప్రాంతంలో చింతచెట్లు విస్తారంగా ఉండేవి. చింతతోపు మధ్యలో వెలసినందువల్ల ఈ స్వామికి చింతల వెంకటరమణుడు అని పేరు వచ్చిందని అంటారు. ఉదయించే సూర్యుని కిరణాలు మూలవిరాట్‌పైనే పడేటట్లుగా క్రీ.శ. 1506లో ఆలయ నిర్మాణం పూర్తయినట్లు తెలుస్తోంది. వారణాశి నుండి ప్రత్యేకంగా రప్పించిన శిల్పులు ఆలయాన్ని కళాత్మకంగా నిర్మించారు.

తిమ్మమ్మ మఱ్ఱిమాను :

ప్రపంచంలోనే అతి పెద్దదైన తిమ్మమ్మ మఱ్ఱిమాను అనంతపురానికి 120 కిలోమీటర్ల దూరంలో కదిరి గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలోని గూటిబైలు గ్రామంలో ఉంది. ఇది 5.2 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. కలకత్తా బొటానికల్ గార్డెన్సులోని, అలాగే మద్రాసు అడయారులో ఉన్న 'మఱ్ఱిమాను'ల కంటే కూడా ఈ మాను రెండింతలు పెద్దది. 1989లో ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టి గిన్నీసు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో తన స్థానాన్ని సంపాదించుకుంది. ఈ మఱ్ఱిమానుకు 550 సంవత్సరాల వయస్సు ఉందని, సుమారు 1100 ఊడలు ఈ వృక్షానికి ఉన్నట్లు బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, బెంగుళూరు వారు తమ సర్వేలో వెల్లడించారు. ✦

కళాసాహితి



'ఒకటి కొంటే మరొకటి ఫ్రీ' నాటికలోని ఒక దృశ్యం

సామాజిక రుగ్మతలకు ప్రతిబింబాలు

విజయవాడ సాంస్కృతికోత్సవాలు

విస్సా శేషగిరిరావు

సకల కళల సమాహారం నాటకం. ఆధునిక సాంకేతిక విప్లవ నేపథ్యంలో కొన్ని దృశ్య మాధ్య మాల ద్వారా పాశ్చాత్య సంస్కృతి వేగవంతంగా మధ్య తరగతి మెదళ్లను తొలిచివేస్తున్నా మంచి నాటకానికి నేటికీ ఆదరణ తగ్గలేదని ఇటీవల విజయవాడలో జరిగిన సాంస్కృతికోత్సవాలు మరోమారు రుజువు చేశాయి. విజయవాడ నగరపాలకసంస్థ ఈ నెల ఐదు నుండి ఏడో తేదీ వరకూ నిర్వహించిన 15వ రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా జరిగిన సాంస్కృతికోత్సవాలు వీక్షకులను అలరించాయి. నగరంలో ప్రతియేటా యువజనోత్సవాల పేరిట నగరపాలకసంస్థ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు వేలాది మంది కళాకారులకు, క్రీడాకారులకు ఉత్సాహ ప్రోత్సాహాలను అందిస్తున్నాయని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వేరు వేరు వేదికలపై జరిగిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు, వీధి నాటికోత్సవాలు నేటి సామాజిక రుగ్మతలను ఎత్తి చూపడమే గాక ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. విజయవాడ నగరపాలకసంస్థ గత 15 సంవత్సరాలుగా నిర్విరామంగా యువజనోత్సవ నాటకాలను నిర్వహిస్తోంది. మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు, వీధి నాటకోత్సవాలు ప్రజలెదుర్కొంటున్న అనేక సామాజిక సమస్యలను ప్రధాన ఇత్తివృత్తాలుగా చూపించి ప్రేక్షకుల మన్ననలందుకున్నాయి. స్థానిక తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నాటిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో నాటక రంగంలో లబ్దప్రతిష్టులైన ఎస్.కె.మిశ్రో, ఎం.సంజీవి, కె.ఎస్.టి.శాయి, వై.ఎస్.కృష్ణేశ్వరరావు, నాయుడు గోపి, ఎం.దివాకర్‌బాబు వంటి ప్రముఖుల రచన, దర్శకత్వ పటిమతో రూపొందించిన నాటికలు ప్రదర్శించడం విశేషంగా చెప్పవచ్చు. రైతు లేనిదే సమాజ మనుగడ శూన్యం, యావత్ మానవాళికి పట్టెడు తిండి పెట్టేది రైతే అంటూ నేటి రైతు పరిస్థితిని 'నమోనమః' నాటిక వివరించగా, ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టిపీడుస్తున్న 'ఎయిడ్స్' మహమ్మరిని వివరిస్తూ దిగజారుతున్న మానవీయ విలువలను సంజీవి 'శబ్దం' నాటికలో కళ్లకు కట్టినట్లు చూపించారు. అలాగే సమాజం లోతుల్లోకి పాతుకుపోయిన అవినీతి ప్రజాప్రతినిధులను ఏ విధంగా ఆడిస్తోందో వివరిస్తూ తద్వారా నిజాయితీ కలిగిన అధికార యంత్రాంగం పడుతున్న ఇబ్బందులను మిశ్రో 'జాగృతి' నాటికలో చాలా

భారత్ వెలిగి పోతోంది!



అవును
భారత్ వెలిగి పోతుంది.
లెక్కకు అందని అప్పులతో పేదరికంతో...
స్కాంలు కుంభకోణాలతో...
నేతల అవినీతి అక్రమార్జనలతో....
రైతన్నల ఆకలి చావులతో... దళారీల
దోపిడీలతో....
నిరుద్యోగుల నిరాశా... నిస్పృహలతో....
మహిళల ఆక్రందనలతో.... హాహాకారాలతో...
వరకట్న విషపు కోరలకి....
బలౌతున్న నవవధువులతో
సంపన్నుల ఇనపెట్టెలలో చెదలు పడుతున్న...
నల్లధనంతో....
ఎన్‌కౌంటర్‌లతో... లాకప్ 'డెత్'లతో...
మూతపడిన పరిశ్రమలతో..
ముక్కుపచ్చలారని బాల కార్మికులతో....
మందుకి.... పచ్చనోట్లకి.....
ఓటర్లని ప్రలోభపెడుతున్న ...
'నీతి' లేని నేతలతో....
భారతమాతని.... ప్రపంచబ్యాంక్‌కి
తాకట్టు పెడుతున్న
నిస్సిగ్గు పాలకులతో....
వెలిగిపోతోంది.... భారత్

- సి.హెచ్.వి.ఎస్.బ్రహ్మానందరావు



'నమో నమః' నాటికలోని ఒక దృశ్యం

సామాన్యుడి గుండె తట్టిన వీధి నాటికలు

ఇక వీధి నాటికోత్సవాల్లో 'కళ కళ కోసం కాదు...ప్రజల కోసం' ప్రజా చైతన్యం కోసం అని నమ్మి దాని కోసం నిరంతరం శ్రమించే ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన పలు వీధి నాటికలు నగర ప్రేక్షకుల గుండె తట్టాయి. పాలకుల విధానాల ఫలితంగా దేశంలో చెలరెగుతున్న మతవిద్వేషాలను 'శ్రీరామ సందేశం' నాటికలో చూపించగా, రాష్ట్రంలోని ప్రాథమిక విద్యారంగ తీరుతెన్నులను 'ఎలిమెంటరీ స్కూల్' నాటిక ప్రతిబింబించింది. అలాగే కృష్ణా డెల్టా రైతాంగం ఎదుర్కొంటున్న నీటి సమస్యపై రూపొందించిన 'సోగ్గాడు-శోభనాద్రి' నాటిక పాలకుల అసమర్థ విధానాలను ప్రస్ఫుటం చేసింది. ఇక నల్గొండ ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన 'వీర తెలంగాణా' నాటి తెలంగాణా సాయుధ పోరాటాన్ని కళ్ల ముందు సాక్షాత్కరింపజేసింది. నాడు తెలంగాణాలో పెత్తందార్ల, రజాకార్ల పాశవిక దాడులకు తల్లడిల్లిన రైతుల దయనీయ పరిస్థితులను, వాటి విముక్తి కోసం పోరాడుతూ అమరులైన వీరుల త్యాగాలను కళాకారులు ఎంతో చక్కగా ప్రదర్శించారు. ఇందులో ప్రతి సన్నివేశమూ ప్రేక్షకుల హృదయాలను కదిలించడమే గాక వారి నుండి కరతాళధ్వను లందుకున్నాయి. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పి.ఎ.దేవి రచించిన ఐదు వీధి నాటికలు నగర ప్రేక్షకులను ఆకట్టు కోవడమేగాక వారిలో ఆలోచనలను రేకెత్తించాయి.



'నగర పాలక సంస్థ పక్షాన సినీ దర్శకులు కె. విశ్వనాథ్‌కు పౌరసన్మానం చేస్తున్న దృశ్యం

చక్కగా వివరించారు. జాతియావత్తూ జాతీయ గీతాన్ని 'నిజాయితీ' గీతంగా ఆలపిస్తే తప్ప ఈ అపశృతి నుంచి బయట పడలేమంటూ కళాకారులు తమ పాత్రల ద్వారా చాటి చెప్పారు. తల్లిదండ్రుల నుండి నిరంతరం డబ్బు కోసం పట్టిపీడించే పిల్లల మనస్తత్వాలను కె.ఎస్.టి.శాయి 'రూల్స్ ఒప్పుకోవు' నాటికలో చక్కగా వివరించారు. ప్రపంచంలో విలువ కట్టలేనిది, దేనికి సాటి రాని సంపద 'అమ్మ' అనే కథాంశంతో రూపొందించిన 'సంపద' నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. డాలర్ల మోజుతో తల్లిదండ్రులను విస్మరిస్తున్న నేటి తరానికి చెంపపెట్టుగా సాగిన ఈ నాటికలోని ప్రతి డైలాగ్ ప్రేక్షకుల నుండి కరతాళధ్వనులందుకున్నది. ముఖ్యంగా ఎవరు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని కనిపెట్టినా దానిని తన కడుపులో నిక్షిప్తం చేసి భావి తరాలకు అందించేది తల్లేనని వై.ఎస్.కృష్ణేశ్వరరావు తన 'సంపద' నాటికలో చూపించిన ప్రతి సన్నివేశం ప్రేక్షకుల మన్ననలందుకుంది. ✦

భారత భూగోళం

ఇప్పుడు
భారత నైసర్గిక చిత్రం బహు విచిత్రం
గత సరిహద్దులు చెదిరిపోయి
అరాజకీయం, అవినీతి, అక్రమం, అన్యాయం ఎల్లలైనాయ్
అధికార అక్షాంశాలు, అర్థం రేఖాంశాలు ఏర్పడ్డాయ్
అప్పుడప్పుడు
మతోన్మాద అగ్నిపర్వతాలు పేలి
నరమేధలావాలు ఉప్పొంగుతున్నాయ్
నిత్యావసర వస్తువులకు
ధరల గ్రహణాలు పడుతున్నాయ్ నిత్యం
భూభ్రమణం లాగే
ఇక్కడి పాలన డబ్ల్యుటిఓ చుట్టూ పరిభ్రమిస్తోంది.
ఫలితంగా
తలసరి అప్పుల పగళ్లు
తీర్చటానికి దారి దొరకని రాత్రుళ్లు ఏర్పడుతున్నాయ్
అన్నదాత సూరీడి వెలుగు
ఏటికేటికి అంతరించి పోతోంది.
విదేశీ సంస్కృతి మీడియా ఋతుపవనాల వల్ల
భారత సంస్కృతికి అనావృష్టి
ప్రేమికుల ఆత్మహత్యల అతివృష్టులు కలుగుతున్నాయ్
జీవితం, జీవనానికి నిరుద్యోగం భూమధ్యరేఖయ్యింది
ఫ్యాక్షన్ ఉపగ్రహమైంది.
చిదిమేసిన ప్రత్యూషపు చిరునవ్వులెన్నో!
జీవనంలో చేదేమిగిలింది
భౌగోళిక రూపు రేఖలు మారి భారత నైసర్గిక స్థితి మారేదెన్నడో!

\- అచ్చుల

న్యాయసలహాలు

అప్పీల్ పీరియడ్‌లో సబ్సిస్టెన్స్ ఇవ్వకపోవడం న్యాయమా?

అయ్యా, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తూ రిమూవ్ అయిన ఉద్యోగి అప్పీల్ పిటీషన్, అప్పిలేట్ అథారిటీస్ వద్ద కాని, రివిజనరీ అథారిటీస్ వద్ద కాని పరిష్కరింపబడకుండా పెండింగ్‌లో వున్నంతకాలం ఆ సదరు ఉద్యోగికి ఏ విధమైన సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇవ్వడం లేదు. ఇది ఎంతవరకు న్యాయసమ్మతం? అసలు అప్పిలేట్/రివిజనరీ అథారిటీస్ వద్ద అప్పీల్ పిటీషన్స్ పెండింగ్‌లో ఉన్నంత కాలం, ఆ ఉద్యోగికి, సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు మధ్య సంబంధాలు యథావిధిగా కొనసాగుతాయా లేదా? పై అధికారులకు అప్పీల్ చేసుకునే అవకాశం సిసిఎస్ (సిసిఎ) రూల్స్ **1964** ప్రకారం న్యాయరీత్యా, చట్టరీత్యా ఉన్నప్పుడు సబ్సిస్టెన్స్ అలవెన్స్ ఇవ్వకపోవడం సమ్మతమేనా? దయచేసి ఈ విషయం మీద జవాబు ఇవ్వవలసిందిగా ప్రార్థించుచున్నాను.

- లక్ష్మణరావు, ఊరుపేరు లేదు

ఏ ఉద్యోగి పైన అయినా క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు అతనిని సస్పెండ్ చేసే అధికారం యాజమాన్యానికి ఉంది. అయితే సస్పెన్షన్ కాలానికి సబ్‌స్టిష్యూషన్ అలవెన్స్ ఇవ్వడం తప్పనిసరి. అయితే ఈ సదుపాయం క్రమశిక్షణా చర్యలు తీసుకొనేంతవరకే వర్తిస్తాయి. అయితే క్రమశిక్షణా చర్య తీసుకున్న తర్వాత ఏవిధమైన అలవెన్స్‌లు ఇవ్వబడవు. ఒకవేళ ఆ ఉద్యోగి అప్పీల్ తదితర తదుపరి చర్యలు తీసుకుని దానిలో తనకనుకూలమైన ఉత్తర్వులు వచ్చి తిరిగి ఉద్యోగంలో నియమించబడితే మొత్తం ఉద్యోగంలో లేని కాలానికి జీతం పొందవచ్చు. ఇది కూడా, తొలగింపబడిన కాలంలో ఆ ఉద్యోగి మరొకచోట ఏ ఉద్యోగం చేయకుండా ఉంటేనే వర్తిస్తుంది. కాబట్టి ఉద్యోగం పోయిన తర్వాత కూడా సబ్సిస్టెన్స్ ఎలవెన్స్ ఇచ్చే సదుపాయం ఏ సర్వీస్ రూల్స్ కిందా లేదు. అది సాధ్యం కాదు.

సెక్షన్ మూసివేస్తే నష్టపరిహారం ఎలా పొందాలి?

నేను ఒక ప్రయివేట్ డ్రగ్ కంపెనీలో పర్మినెంటు ఉద్యోగం చేస్తున్నాను. నా సర్వీసు ఇంకా ఐదు సంవత్సరాలు వుంది. ఆ కంపెనీలో నేను పని చేసే సెక్షన్ మూసివేయడానికి యాజమాన్యం నిర్ణయించింది. ఒకవేళ ఆ సెక్షన్ మూసివేసినట్లయితే మాకు వచ్చే సౌకర్యాలు ఎలా వుంటాయి. నా సర్వీసు పూర్తి వేతనం పొందే అవకాశం వుందా? మాకు వచ్చే సౌకర్యాల గురించి తెలుపగలరు? వాటికోసం మేము ఏమి చేయవలసి వుంటుంది.

- జి.వెంకటయ్య, నర్కూడ, రంగారెడ్డిజిల్లా

మీరు పనిచేసే సంస్థ పారిశ్రామిక వివాదాల చట్టం పరిధిలోకి వస్తుంది. ఆ చట్టంలోని సెక్షన్ 25(ఎఫ్) ప్రకారం మిమ్మల్ని ఉద్యోగంలో కొనసాగించలేని పరిస్థితి ఉంటే మీకు ఒక నెల ముందు నోటీస్, రిట్రెంచ్‌మెంట్ నష్టపరిహారం, గ్రాట్యుటీ ఇతర సదుపాయాలు మీకు లభిస్తాయి. మిగిలిన సర్వీస్‌కు జీతం పొందే అవకాశం ఉండదు. మీరు అనుకున్నట్లు మిగిలిన ఐదు సంవత్సరాల సర్వీస్‌కు జీతం వచ్చే అవకాశం లేదు.

నా ఉద్యోగం నాకు వచ్చే మార్గం చెప్పండి

నేను రైల్వేలో గాంగ్‌మెన్‌గా పని చేయుచున్నాను. నాకు చదువు లేదు. నా భార్య పేరున గవర్నమెంటు వారు స్థలం ఇచ్చి వున్నారు. ఆ స్థలంలో ఇల్లు కట్టేందుకు మా ఊరిలో తోటకూర పెదకాపుగారి దగ్గర డబ్బులు తీసుకున్నాను. ఇంచుమించు **5-6** సంవత్సరాల నుండి అతని దగ్గర నూటికి రు.**5**లు చొప్పున వడ్డీకి తీసుకోవడం, ఇవ్వడం జరుగుచున్నది. నాకు డబ్బులు కావలసినప్పుడల్లా ఖాళీ నోట్లపై సంతకాలు, వేలిముద్రలు వేయించుకున్నారు. మొత్తం ఆ నోట్లు అన్నీ ఎవరి పేర్ల మీదనో వేసి నాపై డిక్రీ పొంది వున్నారు. ఒక సంవత్సరం నుండి నా జీతంలో రు.**1000**లు రికవరీ అగుచున్నది. అదికాక అరెస్ట్ వారెంటుతో నా ఉద్యోగం ఆపు చేయించారు. **4** నెలల నుండి నాకు ఉద్యోగం లేదు. జీతం లేదు. మా ప్లీడరు గారు నా కేసు వదిలి వేశారు. దయ ఉంచి నాకు ఉద్యోగం వచ్చే దారి చూపండి.

- గాలి తాతారావు, పెదబ్రహ్మదేవం, ప.గో.జిల్లా

మీరు ఇచ్చిన వివరాల ప్రకారం చూస్తే జరిగిన దానికి మీ బాధ్యత కూడా ఉంది. ఖాళీ నోట్లపై సంతకాలు, వేలిముద్రలు వేయడం ఎంతమాత్రమూ సమర్థించదగినది కాదు. మీరు జైలులో 48 గంటలు పైబడి ఉండి ఉంటే ఆ ప్రాతిపదికపై మిమ్ములను సస్పెండ్ చేసి ఉండొచ్చు. మీ వ్యక్తిగత, ఆర్థిక లావాదేవీలకు మీ ఉద్యోగ నిర్వహణకు ఎటువంటి సంబంధం లేదు. కాబట్టి మీ పై అధికారికి తగు దరఖాస్తు చేయండి. అందులో విషయాన్ని వివరిస్తూ తిరిగి ఉద్యోగంలో చేర్చుకోవాలని కోరండి. దాన్ని పరిశీలించి తగు ఉత్తర్వులు ఇస్తారు. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించండి. అదే సందర్భంలో మీ ఆర్థిక పరిమితులు సహకరిస్తే మీకున్న ఆస్తిపాస్తులను అమ్మి అయినాసరే అప్పులు పూర్తిగా తీర్చి నూతన జీవితాన్ని ప్రారంభించండి. తిరిగి ఆ తప్పులు చేయకండి.

- ఎ.సత్యప్రసాద్, హైకోర్టు న్యాయవాది

చేపల పులుసు

కావలసిన వస్తువులు:

చేప ముక్కలు: 12
చింతపండు: పెద్ద నిమ్మకాయంత
ఉల్లిపాయ: పెద్దది ఒకటి
కారం: అర టేబుల్ స్పూన్
ఉప్పు: ఒకటిన్నర టేబుల్ స్పూన్
పచ్చిమిర్చి: రెండు
నూనె: అర కప్పు
పసుపు: చిటికెడు
వెల్లుల్లి: ఒకటి
అల్లం: ఒక అంగుళం ముక్క
జీలకర్ర: కాస్త
ధనియాలు: ఒక టేబుల్ స్పూన్
కరివేపాకు: రెండు రెబ్బలు
కొత్తిమీర: ఒక కట్ట

చేసే విధానం: ఉల్లిపాయలు సన్నగా తరిగి, పచ్చిమిర్చి రెండుగా చీరాలి. అల్లం, ధనియాలు, జీలకర్ర, కారం, వెల్లుల్లి, నాలుగు ఉల్లి ముక్కలు, కొంచెం కరివేపాకు వేసి మెత్తగా నూరుకోవాలి. ఒక వెడల్పాటి పాత్ర పొయ్యిమీద పెట్టి నూనె పోసి మరగనిచ్చి, ఉల్లి, మిర్చి ముక్కలు వేగిన తరువాత కరివేపాకు వెయ్యాలి. నూరిన ముద్దవేసి కొంచెం వేయించి, రెండు టమాటాలు పిండాలి. మరో రెండు నిముషాలు ఉంచాలి. చేప ముక్కల్లో ఉప్పు, పసుపు వేసి కలిపి అందులో వేయాలి. సన్నసెగ మీద ఐదు నిముషాలు ఉంచి చింతపండు పులుసు పిసికి పోయాలి. పులుసు సరిపోను ఉన్నదనగా కొత్తి మీర సన్నగా తరిగి అలంకరించాలి. దీనిలో గసగసాలు, కొబ్బరి కూడా నూరి వేసుకోవచ్చు. ఈ పులుసు వేడిమీద కన్నా చల్లారిన తరువాతనే రుచిగా ఉంటుంది.

బెండకాయ పచ్చడి

కావలసిన వస్తువులు:

బెండకాయలు: అరకిలో
పచ్చిమిరపకాయలు: 50 గ్రాములు
చింతపండు: నిమ్మకాయంత
జీలకర్ర: ఒక స్పూను
వెల్లుల్లి: చిన్నది ఒకటి
నూనె: 50 గ్రాములు
ఉప్పు: తగినంత

తయారుచేయు విధానం: ముందుగా బెండకాయ ముక్కలను తరిగి నూనెలో వేయించుకోవాలి. ఆ ముక్కలు తీసి ఆ నూనెలోనే పచ్చిమిర్చి గాట్లుపెట్టి వేయించాలి. పచ్చిమిరపకాయలు, చింతపండు, ఉప్పు రోట్లోవేసి మెత్తగా నూరుకోవాలి. తరువాత వేగిన బెండకాయ ముక్కలు వేసి నూరాలి. దీనిని తోడి జీలకర్ర, వెల్లుల్లి గర్భాలను మెత్తగా నూరి అందులో ఈ పచ్చడిని వేసి కలిసేలా నూరాలి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది